

# గురువే దేవుడు

ఆమని పురివిప్పి హాయి హాయిగా పరవశముతో ఆనందడోలికల్లో మునిగి కొండకోనల పచ్చని అందాలతో ప్రకృతి కిలకిల రాగాలతో విరాజిల్లు తున్న సిద్ధల కోన సమీపములోన చాలా రోజుల నుండి లతేశ్వరుడనే స్వామిజీ వుండేవాడు . కొంత దూరములో బృంగపు రము అనే చిన్న కుగ్రామము ఉండేది. అప్పుడప్పుడూ కొందరు ప్రజలు కట్టెలు కొట్టుకోని పోవడము కోసము సిద్ధల కోనకు వచ్చి పోతూవుండేవారు. ఒక

రోజు ఇద్దరు దంపతులు కట్టెలు కొట్టుకోవడానికి వచ్చి అనుకోకుండా ఓ పాము కాటుకు గురి అయ్యి చనిపోయారు. దీనితో వాళ్లకున్న ఒక్కానొక్క కొడుకు సుమదీపుడు అనాథగా మిగిలి చేసేది ఏమీ లేక ప్రతిరోజు సిద్ధల కోనలోని తియ్యని పండ్లును తింటూ కాలము గడుపుతూ వుండే వాడు. రోజు అంతా గాలిస్తూ అక్కడ ఉన్నట్టి పాములన్నింటిని చంపుతూ పాములపై పగ పెంచుకున్నాడు సుమదీపుడు. ఇలా గడుస్తూ ఉంటే ఓ రోజు అటూ పోతూ ఉన్న స్వామిజీ ఎవ్వరూ నాయనా నీవు ఎందుకు ఈ చీకటి సమయంలో ఇలా దిగాలుగా కూర్చోని ఉన్నావు అని అడిగాడు. అయ్యా నేను ఎవ్వరూ లేని అనాథను అడవికి వచ్చిన తల్లిదండ్రులు పాముకాటుకు గురి అయ్యి చనిపోయారు స్వామి. అందుకే అడవిలో ఉన్న పాములన్నీ చనీపవలెనని అని నేను శపథము పూనినాను అన్నాడు ఆవేశముతో సుమదీపుడు.

నాయనా ఈ ప్రపంచము అంతా దేవుడి సృష్టి. శివుని ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు నాయనా. ఇక్కడ కొంత దూరములో నాకు ఓ చిన్న ఆశ్రమములో వున్నాను అప్పుడప్పుడూ భక్తులు వచ్చి శివుని దర్శనము చేసుకోని వెళుతుంటారు. నువ్వు కూడా అక్కడే ఉందువు అంటూ సుమదీపుడుని తీసుకోని వెళ్లి ప్రతి రోజు శివుని ఆరాధనలో ఉంచి భక్తి పారవశ్యముతో పురాణ ఇతిహాసాలను రోజు చెబుతూ సుమదీపుడు మనసు లోపల ఉన్న పగ ప్రతీకార జ్వాలను పూర్తిగా కరిగిపోయి భక్తిలోన మునిగిపోయాడు సుమదీపుడు. ఓ రోజు స్వామిజీ ఆశ్రమములో నిదిరిస్తూ ఉండగా హోరున గాలివాన వొచ్చింది పైకప్పు ఊగిసలాడు తున్నది అంతలోఓ చిన్నగూడు కిందికి వచ్చి పడింది అందులో నుంచి అప్పుడప్పుడే కళ్లు తెరుస్తున్న చిన్నపాము పిల్లలు కిందికి వచ్చి పడ్డాయి. అంతే ఒక్కసారిగా సుమదీపుడు భీకరంగా లేచాడు వాటిని చంపడానికి. అంతలో లతేశ్వర మహర్షి చిరునవ్వు నవ్వి నాయనా ఎందులకు పాములను చంపుతున్నావు అని అడిగెను. ఏదో అనుకోకుండా జరిగింది. గురువుగారు నేను ఏమియు చనీపుటలేదు స్వామి మీకు ఇచ్చిన మాట మరిచిపోనూ అని చెప్పెను.

నాయనా పూజ చేయుటకు అడవిలోకి వెళ్లి పండ్లను పూలును తీసుకోని వేగిరమే రా అని చెప్పి అడవికి పంపేను లతేశ్వర మహర్షి. గురువు గారి మాట ప్రకారము అడవిలోకి బయలుదేరెను పూలు సేకరిస్తూ ఉండగా చెట్టుకొమ్మపై ఉన్న ఓ పాము ఫట్ మని కాటు వేసింది అంతే గురువుగారు మాట మనసులో గుర్తుకు వచ్చి పామును ఏమీ చేయక వదిలి వెనుకకు వచ్చేశాడు సుమదీపుడు స్వామిజీ వద్దకు వచ్చి చేరాడు. నాయనా ఏమిటీ చేతిపైన రక్తము ఘాట్లు ఏమైంది నాయనా అని అడిగెను గురువుగారు పూలు కొస్తూవుండగా పాము కాటువేసింది అని ధీన వదనములతో చెప్పి పూలు పండ్లను సమర్పించెను.

ఇలా రోజులు గడుస్తూ ఉండగా ఒక్కరోజు మహాశివుని లింగము చుట్టుకోని ఓ పాము పడగవిప్పి అడుతూ ఉంది. అంతలో అక్కడికి వచ్చిన భక్తులు నాయనా సుమదీపుడా పామును పట్టడములో నువ్వు నేర్పరివి కదా చంతపివేయు అంటూ బిగ్గరగా అరుస్తూ కేకలు పెట్టిరి బృంగపురము వాసులు. లేదు లేదు నేను గురువు గారికి మాట ఇచ్చినాను జీవితములో పాములు చంపను అని చెప్పి గురువు వద్దకు వచ్చి పూజలో లీనమై పోయాడు సుమదీపుడు. ఓ రోజు గురువు గారు నాయనా నాకు భూమి మీద నుండి వెళ్లాలిసిన ఘడియలు సమీపించినాయి. నీకు ఏమి వరము కావలెనో కోరుకో అన్నాడు లతేశ్వ మహర్షి. నేను బ్రతికి ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేసే వరము ప్రసాదించండి గురువుగారు అనెను.

నాయనా ప్రాణాలు పోతున్న సమయంలో ఈ మూలికను సాదిపోయి నాయనా ఇది నీకు మాత్రమే కనిపించును మనసులో తలిస్తే చాలు నీ ముందు ఒక్కసారిగాను ప్రత్యక్ష మగును నాయనా. అలాగే పాముకాటుకు ఎవ్వరునూ మరణించకుండా నీవు కాపాడెదవు అంటూ గురువు వరము ప్రసాదించెను . అనేక జనుల ప్రాణాలకి బాసటగా నిలిచి అందరికీ మార్గదర్శిగా సుమదీపుడు నిలిచాడు. అందుకే ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని గురువు జీవిత సత్యమును లతేశ్వర మహర్షి నేర్పాడు. అందుకే సృష్టిలో ప్రతి ఒక్కరికీ గురువే దేవుడు అని నమ్మి బృంగకోనపువాసులకు విద్యా బుద్ధులు చెబుతూ గురువు బాటలో నడిచాడు సుమదీపుడు.



-ధనాశి ఉషారాణి
9121096397

## వదిలేస్తున్నారు

పిల్లలను బాల్యం నుంచే
తల్లిదండ్రులు
రెసిడెన్షియల్ స్కూళ్లల్లో
వదిలేస్తున్నారు.

పిల్లలు పెద్దయ్యాక
తల్లిదండ్రులను
వృద్ధాశ్రమాల్లో
వదిలేస్తున్నారు.



– ఏ. గజేందర్‌రెడ్డి
9848894086

## కరోనాతో వద్దు హైరానా

పిల్లలు....బాలలు
కరచాలనం వద్దండి
నమస్కారమే ముద్దండి

బుడతలు..బుజ్జాయిలు
వీధి తిండి వద్దండి
అమ్మ వంట ముద్దండి

పిడుగులు...గిడుగులు
పారిశుద్ధ్యం గమనించండి
పరిశుభ్రత పాటించండి

చిన్నారులు...చిట్టిగువ్వలు
విహారయాత్ర వద్దండి
ఇంటిపట్టున ఉండండి

అబ్బాయిలు..అమ్మాయిలూ
కరోనాకు భయపడకండి
హైరానా పడకండి

పెద్దలూ..వైద్యులూ
అవగాహన కల్పించండి
నివారణ కల్గిగించండి



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

# బాల వికాసం

## కష్టేఫలి



అనగనగా ఒక ఊరిలో ఒక రంగయ్య అనే ఆయన ఉండేవాడు. రంగయ్య రోజూ పొలం పనిచేసుకొని జీవించేవాడు. ఒక రోజు ఆయనకు పొలంలో బంగారం



దొరికింది. రంగయ్య ధనవంతుడయ్యాడు. రంగయ్య ఇంటి పక్కనున్న బాలయ్య, రంగయ్య దగ్గరకు వెళ్లి నీవు ఎలా ధనవంతుడయ్యావు? అని అడిగాడు. అందుకు రంగయ్య నేను మా పొలంలోని బావిలో దూకాను. ఆ బావిలో బంగారం దొరికిందని బాలయ్యకు చెప్పాడు.

ఒక రోజు బాలయ్య, రంగయ్య ఊరిలో లేని సమయం చూసి రంగయ్య పొలానికి వెళ్లి బావిలో దూకాడు. అక్కడ ఎంత వెతికినా బంగారం దొరకలేదు. బాలయ్య బాగా అలసి పోయాడు. ఇంతలో రంగయ్య పొలానికి వచ్చాడు. బావిలోని బాలయ్యను చూశాడు. రంగయ్య, బాలయ్యతో

" నీవు ఒట్టి వెర్రివాడులా ఉన్నావు. ఎక్కడైనా బంగారం ఊరకే దొరుకుతుందా! నేను నీకు అబద్ధం చెప్పాను. నేను నా పొలంలో కష్టపడి పనిచేసి డబ్బు సంపాదించి ధనవంతుడయ్యాను" అని అన్నాడు. బాలయ్య తన అమాయకతనానికి సిగ్గుతో తలదించుకున్నాడు.




-కథ:పి.ప్రకాష్, 2వ తరగతి
-చిత్రం: వెంకటాద్రి , 3వ తరగతి

## మళ్ళీ మళ్ళీ

"మళ్ళీ మళ్ళీ"
రాదు ఈ జీవితం
నేడు నీవు విజయం సాధించు
బంగరు భవితకు ప్రాణంపోయు ॥ మ॥

కృషివుంటే మనుషులు మహా ఋషులవుతారని
ఇష్టపడి కష్టపడితే విజయం నీదే అన్నారు
ఆ ఘన విజయం నీదే అన్నారు ॥ మ॥

చదువుకుంటేనే మంచి జీవితానికి వెలుగన్న
చదువుకోకపోతే జీవితానికి చీకటన్న
వెలుగే జీవితం ఒక బల్బురా
వెలగని జీవితం కారు చీకటిరా ॥ మ॥

నీ తల్లిదండ్రికి దండంపెట్టు
నీ గురువులను నిత్యం గౌరవించు
నీవు చదివిన బడిని మరవద్దు
నీ అమ్మ నాన్న, గురువు
అన్ని ఈ బడియె.. నీ గుడిరా..



-మియాపురం శ్రీనివాస్ పూడూర్
9493264620



## అమ్మ ప్రేమ

మా ఊరి
చెరువు కట్టమీద
కట్టెలేరి అన్నం వండి
ముద్దపెట్టేది అమ్మ
చిన్నప్పటి నుండి
పెద్దయ్యేదాక
పోషించిన మా అమ్మ ఆమె
ఆమె నవ్వుతే
మల్లె మొగ్గల లెక్క

ఆమె చేతి ముద్ద తింటే
అమృతంలెక్క
ఆమె పేరు అనిత
అందుకే ఈ కవిత

– ఓం ప్రకాశ్
ప్రభుత్వ ఆశ్రమోన్నత
పాఠశాల
సలూద్‌పూర్
మం॥ బేల, జి॥ ఆదిలాబాద్

## విలువలు

మనిషి జన్మ
అమూల్యం
విలువల్ని వదిలేసి
చెల్లించకు భారీ మూల్యం.



– బి. గోవర్ధనరావు
సెల్: 9441968930

## మేలుకొలుపు (కథ)

ఇంట్లో ఒంటరిగా ఉన్న రమేష్ ఆ రోజు ఆదివారం కావడంతో జొమాటోలో బిర్యానీ ఆర్డర్ చేసి టి.వి.లో వార్తలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. ఆర్డర్ చేసిన కొద్ది సేపట్లోనే డెలివరీ బాయ్ బిర్యానీ డెలివరీ చేశాడు. అంతలోనే అతని చూపు పక్కనే ఉన్న ఫుల్ బాటిల్ పై పడింది. గ్లాసు, వాటర్ బాటిల్ ముందున్న టీపాయ్ పై సర్దుకున్నాడు. బిర్యానీ పొట్లం విప్పి మసాల వాసనను ఆస్వాదిస్తూ చికెన్ ముక్కలు నంజుకుంటూ రెండు పెగ్గులు వేశాడు. టి.వి. మోగుతూనే ఉంది. బిర్యానీ గబాగబా లాగించేసి చెత్తనంతా చెత్తబుట్టలో పడేశాడు. అంతలోనే తన పుట్టింట్లో ఉన్న భార్యా, పిల్లలు గుర్తుకొచ్చారు. ఫోన్ చేసి మాట్లాడి తన ఒంటరితనపు గోడును వెళ్లబోసుకున్నాడు. ఎప్పుడొస్తారంటూ ఆరా తీశాడు. అతనికి టి.వి. చూస్తూ నిద్రపోవడం అలవాటు. టి.వి.లో వార్తలు చూస్తూనే మత్తు నిద్రలోకి జారుకున్నాడు. టి.వి. కి టైమర్ ఫిక్స్ చేయడంతో కాసేపటికే ఆగిపోయింది.

మధ్య రాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది అతనికి. గొంతంతా నులిమేసినట్టు ఎడతెరిపి లేని దగ్గు రావడం ప్రారంభమైంది. దాంతో పాటు పిల్లికూతలు. చాతి బరువెక్కింది. శ్వాస వేగం పెరిగింది. ఉన్న చోటి నుండి కదలలేని ఆశక్తత శరీరాన్ని ఆవహించింది. ఊపిరితిత్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇక కొద్ది క్షణాల్లోనే తన గుండెకు విశ్రాంతి లభిస్తుందని నిర్ధారించుకున్నాడు. పక్కనే డ్రెస్సింగ్ టేబుల్ పై ఉన్న ఫోన్ వైపు చూశాడు. కాని దానిని అందుకోలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. మధుర క్షణాలు, చేదు జ్ఞాపకాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. చిన్నప్పుడు బడిలో స్నేహితులతో కలిసి చేసిన చిలిపి అల్లరి, తన పదేళ్ల వయస్సులో తీవ్ర జ్వరంతో బాధపడుతున్నప్పుడు కంటి మీద కునుకు లేకుండా కాచుకు కూర్చున్న అమ్మానాన్నల ప్రేమానురాగాలు, కాలేజీ రోజుల్లో సరదా తిరుగుళ్లు, భార్యతో గడిపిన మధుర క్షణాలు, పిల్లలను వీపు పై ఎక్కించుకుని తిప్పిన గుర్రం ఆటలు ఇవన్నీ గిరికీలు కొడుతున్నాయి. అంతలోనే నీడలా వెంటాడుతున్న మరో జ్ఞాపకం అతన్ని కన్నీళ్ల పర్యంతం చేసింది. వారం రోజుల క్రితం ప్రభుత్వం నెత్తీనోరు వెళ్లబోసుకుంటున్నా వినకుండా సూపర్ మార్కెట్లో ముక్కుమూతికి మాస్క్ లేకుండా జనాన్ని తోసుకుంటూ తిరగడం, లాక్ డౌన్ ప్రకటించినా టింగురంగా అంటూ రోడ్ల పై షికారీ చేయడం, పోలీసులతో లాఠీ దెబ్బలు తినడం. ఆ నిర్లక్ష్యమే పడుకున్న మంచాన్ని మరణశయ్యను చేసిందని కుమిలికుమిలి ఏడ్చాడు. ఆ చివరి క్షణాలు రానే వచ్చాయి. అరచేతిలో పట్టిన నీటి చుక్కల్లా తన ప్రాణాలు జారిపోతున్నట్టు స్పష్టంగా తెలుస్తుంది.

ంతలోనే ట్రింగ్ ట్రింగ్ అనే శబ్దం. అతనికది మరణ గంటలా వినబడింది. మళ్లీ ట్రింగ్ ట్రింగ్ పేపర్ అనే మాటలు చెవుల్లో మారుమ్రోగాయి. ఉలిక్కి పడి లేచిన రమేష్ కు అర్థమైంది అదంతా పీడకలని. అదే నిజమైతే తన పరిస్థితేంటి అని నిర్ఘాంతపోయాడు. తలుపు తెరిచి తీసుకున్న పేపర్ను తిరగేశాడు. రోజురోజుకు కరోనాతో విషమించిపోతున్న వార్తలు చూసి తను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడ్డాడు. ఆ పీడకల నిర్లక్ష్యంతో కూరుకుపోయిన అతని మనస్సు తలుపులను తెరిచింది. వెంటనే పోలీసు కమిషనర్ కార్యాలయానికి వెళ్లి తన నిర్లక్ష్యాన్ని వివరించి మీతో పాటు వాలంటీరుగా పనిచేస్తానని ప్రాధేయపడ్డాడు. అనుమతిని పొందాడు. ఆ రోజు నుండి వీధి వీధి తిరుగుతూ చేతులు శుభ్రపరుచుకోవాల్సిన తీరును గురించి, సామాజిక దూరం పాటించాల్సిన ఆవశ్యకతను గురించి, బాధ్యత గల పౌరుడిగా గృహ నిర్బంధంలో ఉండడం ద్వారానే కరోనా మహమ్మారి నుండి మనల్ని, తద్వారా రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించాడు. తన పీడకల ఎవరి ఇంట్లో పునరావృతం కాకూడదని తపన పడ్డాడు. ఆ పీడకల అతన్ని ఒక బాధ్యత గల పౌరుడిగా తయారుచేసింది. కరోనా మహమ్మారి పై అలుపెరగని యుద్ధం చేసేలా మేల్కొలిపింది.



– గుండు కరుణాకర్,
సెల్: 9866899046.

# కరోనాపై అంతర్జాల కవుల కదనం

కళ్ళకు కనపడని, చేతికి దొరకని మహమ్మారి ఒకటి యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తుంది. కాళ్ళను బంధించి, మనుషులను గృహ నిర్బంధం చేసి, ఆయుర్వేదానికి అంతుపట్టకుండా, అల్లోపతికి చిక్కకుండా, హోమియోపతికి సవాల్ విసురుతూ సరదా చేస్తుంది మాయదారి "కరోనా". ఈ మూడక్షరాల మహమ్మారి మానవులను భయకంపితులను చేస్తుంది. తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజారక్షణే ధ్యేయంగా వైద్యులు, పోలీసులు తమ కర్తవ్య బాధ్యతను మరింత పెంచి ప్రజలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వానికి చేయూతనిస్తూ విశేషకృషి సల్పుతుంటే, మరోవైపు పారిశుద్ధ్య సిబ్బంది పరిశుభ్రతే పరమావధిగా నిరంతరాయంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు పత్రికాధికారులు, సిబ్బంది ప్రజలకు మనో నిబ్బరాన్ని, ధైర్యాన్ని పెంపొందించుతూ అనేక విధాలుగా అహరహం కృషి సల్పడం అభినందనీయం. ప్రభుత్వ పిలుపు మేరకు స్వీయ నియంత్రణ పాటిస్తున్న ఈ సమయంలో జలగలా పట్టి పీడిస్తున్న "కరోనా" పై ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా పోరాడుతూ జనభయాన్ని తొలగిస్తూ వారిలో చైతన్యభావాలు పెంపొందిస్తున్నారు అని చెప్పడానికి చక్కని తార్కాణం "శ్రీ మేకరవీంద్ర గారి అంతర్జాల కవి సమ్మేళనం". వాట్సాప్ సాహిత్య గ్రూపుల సృష్టికర్తగా పేరొందిన వీరు కరోనాను ఖండిస్తూ కవులు, రచయితలతో ఆన్ లైన్ కవిసమ్మేళనం నిర్వహించుటకు 3-4-2020 న శ్రీకారం చుట్టడం ప్రశంసనీయం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంతో నేర్పుగా, ఓర్పుతో ఉపయోగిస్తూ, దానిని ఎలా ఉపయోగించాలో కవులందరికి ముందుగా శిక్షణ ఇస్తూ, ప్రతిరోజు మూడు, నాలుగు దఫాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అనేకమంది కవులు ఉత్సాహంతో పాల్గొనడం అభినందనీయం. ఆదివారం జరిగిన ఈ వినూత్న కార్యక్రమానికి పాల్గొన్న కవులు... 1) ఇమ్మడి రాంబాబు, మూర్తి శ్రీదేవి, పెసరు లింగారెడ్డి, చౌకి.రాజేంద్ర , అష్ట.రాధ గారు, డా.తెలుగు తిరుమలేష్ గారు, ఓబిల సూర్యకుమారి గారు, జి.భారతి , ఉమా ప్రెన్ , బి.రమాదేవి, బి.రాజు,వి.సంధ్య, యల్.గాయిత్రి , శాంతారెడ్డి , సంధ్యా రెడ్డి , అష్ట. అనిత విల్సన్ , జి.శ్రీదేవి, సత్యనీలిమ, కాల్వ రాజయ్య, రమాదేవి బాలబోయిన, ధనాశి ఉషారాణి తదితరులు. సాహిత్యాభిమానిగా, సాహిత్య పోషకునిగా, ఎన్నో కవి సమ్మేళనాలు నిర్వహించి, సహస్ర పేరుతో అర్హత గలవారికి విభిన్న బిరుదులు కూడా ప్రధానం చేస్తుంటారు. వీరు ఇటీవల అంతర్జాల రేడియో కార్యక్రమాన్ని కూడా ప్రారంభించి



అనేకమంది రచయితల, కవుల రచనలను, సమకాలీన సంఘటనలను ప్రసారం చేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. తెలుగు సాహిత్య వైభవం వ్యవస్థాపకులు శ్రీ మేక రవీంద్ర గారు తెలుగుభాషాభివృద్ధి కొరకు అహర్నిశలు పాటుపడుతూ, దానికోసం అనుక్షణం ఆలోచించే సాహితీ సంపన్నులు, ప్రముఖులు, సుహిత సంస్కార సుగుణశీలి ఎదిరె చెన్నకేశవులు గారి ముద్దుల మనుమడు, నైతిక విలువలకు

> "ఇతరుల నుండి ఏమైనా ఆశించినప్పుడే సమస్యలు వస్తాయి, కనుక ఎవ్వరు దేనినీ ఆశించకుండా తన పనులు తాను చేసుకుంటూ పోవాలి"

నిలువెత్తు రూపమైన అంజనీదేవి, లక్ష్మణరావు గార్ల ప్రియపుత్రుడు మేకరవీంద్ర గారు. వీరు పంచాయితీ రాజ్ శాఖలో ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం 'చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసరు' గా సేవలందిస్తున్నారు. ఒకవైపు బాధ్యతాయుతమైన వృత్తిని నిర్వహిస్తూనే మరోవైపు సాహితీసేవకు తమ అమూల్యమైన సమయాన్ని కేటాయిస్తూ తెలుగుతల్లికి కవితాభిషేకం చేస్తుండడం విశేషం. దాదాపు 3000 మంది కవుల కలములను సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, భావుకతతో నింపుతూ వారి అక్షర చైతన్య కుసుమాలతో దేశమంతా కవిత్వ పరిమళాలను వెదజల్లుతున్న సాహితీ పోషకులు శ్రీ మేక రవీంద్ర గారు. దేశం నలుమూలలా ఉన్న కవులందరిని వెలుగులోకి తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో దేశములోనే మొదటి సాహితీ సమూహము ధాశరథీ కవితా వేదికను 2014 లో, మరియు 'తెలుగు కవితా వైభవం' అనే సంస్థను స్థాపించారు. 'ప్రయిత కవితయజ్ఞం' పేరిట 10-7-2015 నుండి 15-2-2017 వరకు ఒక లక్ష కవితలు పోస్టు చేయాలని నిర్ణయించినా ఊహించని విధంగా లక్షాయాభై నాలుగు వేల తొంభై నాలుగు కవితలతో రికార్డు సృష్టించారు.

కవులు తమ కవితలను పుస్తక రూపములో తీసుకురావాలంటే ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినదని భావించి వారికి ఆర్థికభారం తగ్గించాలన్న ఉద్దేశ్యంతో పుస్తక ముద్రణ కూడా చేపట్టి ఇప్పుడు పుస్తకాలను ముద్రించే పనిలో మునిగిపోయారు. అంతేగాక పలుచోట్ల జరిగే సాహిత్య కార్యక్రమాలకు గుర్తింపు తీసుకురావాలన్న మంచి ఉద్దేశ్యంతో "సహస్ర కీర్తి పుస్తకం" పేరిట నమోదు చేస్తున్నారు. వీరి సాహిత్య సేవలకు ప్రముఖులు, పలు సంస్థలు ఎన్నో బిరుదులతో సత్కరిస్తున్నాయి. జూలై 15 న యాదాద్రిలో జరిగిన ఉదయకళానిధి సంస్థ అధ్యక్షులు శ్రీ శిఖా గణేశ్ గారు " సాహితీ సేనాపతి" అనే బిరుదుతో సత్కరించడం హర్షదాయకం.

చెరగని చిరునవ్వును సొంతం చేసుకొని, మిత భాషిగా పేరొందుతూ, అభిమానాప్యాయతలను ఆకళింపు చేసుకొన్న నిరాడంబరుడు, నికల్మషమూర్తి, నిజాయితీపరుడు మేక రవీంద్ర గారు. "ఇతరుల నుండి ఏమైనా ఆశించినప్పుడే సమస్యలు వస్తాయి, కనుక ఎవ్వరు దేనినీ ఆశించకుండా తన పనులు తాను చేసుకుంటూ పోవాలి" అనే తన అభిప్రాయం తన నిస్వార్థతను ప్రతిబింబిస్తుంది. ఇవ్వడమే తప్ప తీసుకోవడం అంటూ ఎరుగని రవీంద్రగారు ఆడంబరాలు కాని పేరు ప్రఖ్యాతులు కాని పదవులు కాని కోరుకోరు. తన మంచితనమే తనకు శ్రీరామరక్ష, తన సహృదయతే తనకు సంతృప్తి , తన పరోపకారమే తనకు బలం. నిరంతరం సాహిత్య కృషి చేస్తున్నమేక రవీంద్ర గారి ఆశయాలకు, వారి ఉన్నత సంకల్పానికి మనమంతా సహాయ సహకారాలు అందిస్తూ మన తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రపంచం నలుమూలలకు చాటుదాం. శ్రీ మేకరవీంద్ర గారి ఉన్నత వ్యక్తిత్వం మనకు ఆదర్శం, వారి సాహిత్యాభిలాష మనకు స్ఫూర్తిదాయకం, వారి ఆలోచనా విధానం మనకు రాచబాట, వారి సహృదయత మనకు అనుసరణీయం అని తెలియచేస్తూ వారి సాహిత్య సేవ ఇలాగే వర్ధిల్లుతూ, వారి కృషి తెలుగు భాషా చరిత్రలో చిరస్థాయిగా నిలవాలని ఆశిస్తూ ... ఈ అంతర్జాల సాహిత్య కార్యక్రమాలు మరింత ప్రగతి మార్గంలో సాగాలని కోరుకుంటూ.... ఈ వినూత్న కార్యక్రమాన్ని దేశ విదేశాలలోని రచయితలు, కవులందరు సద్వినియోగపరుచుకోవాలని భావిస్తూ...



-మూర్తి శ్రీదేవి
8790560365

## కరోనా మరణ మృదంగం

ఉ॥ కామిని మాయరక్కసిల కంటికినించుక గానరాకనే
యీమహి శాంతిలేక జనులెందరొగూల కరోనధాటికిన్
యేమతిజీవమిద్దుతరి నెల్ల భితాహులునయ్యి యింటనే
క్షేమముగోరియుండియును చేయుచునుండిరి పోరుదానితో.

కరోనా జిమ్మిక్కులను త్రిప్పికొట్టాలి
ప్రతిమనిషి ఆయుధం ధరించాలి
గృహ నిర్బంధ మారణాస్త్రంతో
యుద్ధానికి సిద్ధంకండి
దొంగలా వచ్చింది దొంగదెబ్బ తీస్తుంది
మనమూ కనిపించకుండా చంపుదాం
అందుకు రోడ్లన్నీ నిర్మానుష్యం చేద్దాం
నిశ్శబ్ద వైఖరిని పాటిద్దాం.
కేవలం మన గుండె చప్పుళ్ళే వినిపిద్దాం
దిక్కు తోచక కరోనా క్షీణిస్తుంది
శక్తి సన్నగిల్లుతుంది
పట్టు వీడకండి ఇంటిని వదలకండి
దూరంగా ఉండండి శుభ్రత పాటించండి
తలుచుకుంటే మనిషికి సాధ్యం కానిదిలేదు.
అందుకు సంఘటితం,ఆత్మస్థైర్యం కావాలి.

భారత ప్రధాని పిలుపుతోయావద్దేశమంతా
విద్యుద్దీప నిర్బంధనచేసి జ్యోతులు వెలిగించి
సంఘీభావం ప్రకటించారు.
అది జ్యోతిష్య శాస్త్రం ప్రకారం వామన ద్వాదశి,
మఖ,పుబ్బ నక్షత్రములు రాత్రి తొమ్మిదిగంటలకు
సింహరాశిలో చరించే సమయం.
గ్రహ పీడ,దుష్టశక్తులను దగ్ధం చేసే సమయం అని
పెద్దల నుడువు.
కరోనాతో యుద్ధంలో పాలుపంచుకుంటూ
ఆ మహమ్మారిని పారద్రోలుదాం.
అంతవరకు ఇంట్లోనే
ప్రేమానురాగాలు
పంచుకుంటూ గడిపేద్దాం.



-ఎలగందుల లింబాద్రి.
చరవాణి. 7659834393.

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపుకుని 5 సం॥రాలకు రూ.700/-, 10 సం॥రాలకు రూ 1200/- మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74,
జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.

## దారి లేదు "కరోనా"...!

పసి కూనవైనా...
ప్రపంచాన్ని చుట్టేస్తున్నవు

కంటికి కనిపించక
ఆయుధానికి లొంగక
అణుబాంబుకు బెదరక
యథేచ్ఛగా విస్తరిస్తూ
ప్రాణాల తోడేస్తున్నవు.

కాలాతీత దుష్ట శక్తివో...
మృత్యు మానస పుత్రికవో...
ఎవరివైతే మాకేంటి?

నిన్నటి దాకా నీ కోర్టులో
ఇప్పుడు బంతి మా అధీనం

నీ దారులన్నీ మూసే
దారుల అలవోకగా పట్టినం.

అధినేత మాట జవదాటకున్నం
లాక్ ఔట్ నిక్కచ్చిగా పాటిస్తున్నం
ఆత్మ విశ్వాసమే ఆయుధం చేసినం
దృఢ సంకల్పానికి ఊపిరి పోసినం
నిబద్ధ సైనిక రూపుదాల్చినం
ఇంటిని దుర్భేద్య కోట చేసినం
సామాజిక దూరం ఆచరిస్తున్నం
స్వీయ నిర్బంధ నినాదమెత్తినం

మనుషులం దూరమై...
మనస్సుల చేరువ చేసినం

ఒకరి కోసం అందరు...
అందరికోసం ఒకరుగా నిలిచినం.
ఈ ధర్మ పోరులో
ఓటమి నీ పక్షం
గెలుపు మా కైవశం
వేరే దారిలేదు కరోనా!
ఇక చావే నీకు శరణ్యం.



– కోడిగూటి తిరుపతి
9573929493

## ఆకలి హత్యచేస్తుంది

కరోనా పుణ్యమాని
కలవారంతా కాలు బైట పెట్టకుండ
సర్వ సుఖాలనుభవిస్తూ కాలక్షేపం చేస్తుంటే
కూలీలు వలస జీవులంతా
లాక్ డౌన్ లో బంధీలై
అష్ట కష్టాల జీవితాలను గడుపుతున్నారు
కలవారికి వడ్డించిన ఇస్తరి
కడుపు నిండా తిని కంటి నిండా నిద్రపొమ్మంటుంది.
కష్టజీవులను కన్నీటి కడలిలో నెట్టింది
వలస జీవులకు వెతల వాతలు పెట్టింది
పేదల ఇంట నిల్వ సరుకులు నిండుకున్నాయి
వండుకోను కుండ పొయ్యి ఎక్క
పిడికెడు గింజలు కరువు, గ్లాసెడు గంజి కరువు
మోకాళ్ళు ముడ్చుకోని పండుకొంటే
కునుకు పట్టనీయదు ఆకలి.
కరోనా పుణ్యం
బ్లాక్ మార్కెట్ భలిసిపోయింది
వ్యాపారుల అధిక ధరల నిలువు దోపిడి
తూకం మోసం పెరిగి పోయింది
పుచ్చిన సరుకులు హెచ్చు రేట్లు
పారపోసే కూరగాయలను అమ్ముకొని
సొమ్ముచేసుకునే రోజులు.
వున్నవాడికి ప్రాణమే మిన్న
లేనివాడికి పూట గడవడం కష్టం.
బత్కు జీవన బండి నడవడం బహు కష్టం.
నెత్తి మీద నీడ లేనోళ్ళు
వుండ గూడు లేనివాళ్ళు
చేతిలో పని లేనోళ్ళు
కడుపుకు తిండి లేనోళ్ళు
ఆకలిని ఎట్ల జయించగలరు
ఆకలి ముందు ఓడినోళ్ళు
జీవితాలను ఎట్ల జయించగలరు
ప్రాణాలను ఎట్ల నిలబెట్టుకోగలరు
కరోనా కాటు వేయక ముందే
మాటు కాచి కాటు వేసి
హత్యలు చేస్తుంది ఆకలి
ఈ హత్యలకు కారణం కరోనానా ?



–ఉప్పెన
8106073661

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 16-4-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3


## నమ్మలేని నిజాలు

అతడు హరి
సఫాయి కర్మచారి
జనం జేజేలు

జన రక్షణ
రాత్రింబవళ్లు ద్యూటీ
జనం నమస్తే

జీవన దాత
భగవంతుడి రూపం
జనంహారతి.

చప్పట్ల మందు
కరోన చావు మందు
ఐక్యత బాంబు

వెలుగు దివ్వె
కరోన చరమగీతం
కాంతి సమరం



– రేడియమ్

## శ్రీనిజాలు

పారిశుద్ధ్యం కార్మికులు
పోలీసులుదేవుళ్ళోయ్!
ప్రాణాలను కాపాడే
డాక్టర్స్ సంజీవినిలోయ్!

ఉన్నదితిని ఇంట్లుండని
చెప్పుతుంది కాలం!
కరోనాకు లాక్ డౌనే
అన్నింటికి మూలం!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## యుద్ధం

ఇపుడు వెనక్కి
చూడటమంటే
తిరోగమనం కాదు
పలాయనం
ఎంత మాత్రం కానేకాదు.

లక్ష్యాన్ని
అంచనా వేసేటప్పుడు
పట్టు విడుపు
ప్రథమ సూత్రం
సమయ స్ఫూర్తి కూడా.

విల్లు వొంగిందని చూసి
వికటాట్టహాసం చేయకు
యుద్ధ మర్మం అది.

నీ కిరీటాన్ని కూల్చడానికి
భల్లున ఉదయించే
ఒక్క కిరణం చాలదు
అలుముకున్న చీకట్లు
పటాపంచలు కావడానికి.

నీవు మాయావి అట కదా!
ఇంద్రజిత్తుకు తాతవట
తరచి చూస్తే తెలిసింది
బహురూపు లోడివని.

నీవు కవ్వించినంత మాత్రాన.
కదన కుతూహలం లేదు నాలో
పిరికిపందు అనుకున్నా సరే.

నిశ్శబ్ద యుద్ధతంత్రులు మీటుతూ
లోబర్చుకోవాలనుకుంటున్నావు.
అదుగు తగ్గానని
చంకెలు గుద్దుకోకు
ఎదురు చూపు
ఎంతటి భయంకర శిక్షో
కాల పరీక్షలో తేలుతుంది.
ఇష్టమృష్టాన్నంతో
ఎర వేయకు
రేషటి బలుసాకే నాకు
పరమ ప్రీతి.



– డా॥పోరెడ్డి రంగయ్య
సెల్: 9948049864

## గొలుసులు తెంపాలి

కరుణ లేని కరోనా
ఇది నీకు న్యాయమా !
మానవ చరిత్రలో
మాయని పెను గాయమా !!

కంటికి కనిపించకుండ
ఒంటిలోకి చేరుతావు !
అంటువ్యాధి నేనంటు
కాటిలోకి చేర్చుతావు !!

మనిషి నుంచి మనిషికి
దూరాన్ని పెంచుతావు !
కదలకుండ ఇంటిలోన
ఖైదు చేసి ఉంచుతావు !!

కరచాలనం చేస్తె
కరవాలం దూస్తావు !
ప్రేమతో వాటేస్తె
పామై కాటేస్తావు !!

మేమంతా పూనుకుంటె
నీ అంతం ఖాయం !
గొలుసుకట్టు తెంపేస్తె
మాదే ఇక విజయం !!



–డా॥ టి. గౌరీశంకర్
9440969130

## తావీజులు కట్టండి

ఇదేమి వింత అనుభవం
నన్ను నేను రక్షించుకోవడమే గాని
నిన్ను రక్షించడమెలాగో తెలియలేదు
ఇప్పుడంతా రివర్స్
రెడ్ క్రాస్ తో పని లేదు
రెడ్ జోన్ లో బ్రతకాల్సినదే
భూకంపాలలో తుఫానులలో
ఎత్తిన చేయి, వంచిన నడుము
ఎందుకో భయపడ్డాయి
కరోన రక్కసి మరణ మృదంగానికి
అక్కరకురాని చుట్టాలయ్యాయి

రామ్, రాబర్ట్, రహీం లెక్కడ
స్వస్థత కూటములెక్కడ
ఇప్పుడు ఐదుగురే దేవుళ్ళు
డాక్టర్, పోలీస్, పారిశుద్ధ్య కార్మికుడు,
ఆకలితీర్చే రైతు, చిరు వ్యాపారి
అంజనాలువేద్దామా
రాశిచక్రం వేద్దామా
కరోనా కట్టడికి
ప్రార్థనలు ప్రదక్షిణలు దండాలు
ముడుపులు రక్షించలేవని తేలింది
ఇక హెచ్చరికలే శిరోధార్యం

క్వారంటయినే కోట గోడ
ఇప్పుడు కట్టండి తావీజులు
కోట గుమ్మాలకు
అంతా సద్దుమణిగాక అయినా
మనమెక్కడున్నామో
ఏం చేయాలో తెలుసుకోవాలి



–బి. అంజనీదేవి
9849875082

## ఆమె

నీ పుట్టుకకు
ఆలవాలం ఆమె2
నీ పెరుగుదలకు
ఆనవాలు ఆమె
నీ ఉన్నతికి
చేవ్రాలు ఆమె
నీ బ్రతుకు నావకు
దిక్సూచి ఆమె
నీ జీవన గమనానికి
చుక్కాని ఆమె
నీ జీవిత పుస్తకానికి
విషయ సూచిక ఆమె
ఆమె లేనిదే నీవే కాదు
ఈ జగతే లేదు
ఆమె బాగుంటే
ఆమెలోనే ప్రకృతి
ఆమెను బాధ పెడితే
ఆమెతోనే వికృతి.



–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## మహిళ...



కడుపు మార్చుకుని
ఆకలి తీర్చేది
కరుణ నింపుకొని
ప్రేమను పంచేది !

సెలవులే ఎరుగని
శ్రమ జీవి
కల్మషం తెలియని
కష్ట జీవి !

కష్టాలలో పెరిగినా
కదలకుండా నిలిచేది
ఆపదలెన్ని ఎదురైనా
అదరకుండా నడిచేది !

ఆపదలో ఉన్నవారికి
ఆపన్న హస్తం
బంధాల విలువలకు
చేయూతనిచ్చే నేస్తం !

తాళిని తాకట్టుపెట్టినా
పతినే దేవుడనుకుంటుంది
రాచిరంపాన పెట్టినా
మదిలోనే దాచుకుంటుంది !

అంధకారం ఉందంటే
ఆడపడుచులు లేరని
అభిమానం దొరికిందంటే
అతివలున్నారని !

అణకువకు ప్రతిరూపమై
ఆదర్శంగా నిలుస్తుంది
ఆరాధనకు మరోరూపమై
భక్తురాలిగ పిలుస్తుంది !

అందరి సుఖాన్ని
తాను కోరుకుంటుంది
తన దుఃఖాన్ని
తనలోనే దాచుకుంటుంది !

జాతి పురోగతికి
వారసురాలు అవుతుంది
మహిళా జగతికి
మార్గదర్శిగా నిలుస్తుంది !

అనురాగపు పూదోటలో
ఎదిగిన మందారాలు
అపురూపమైన కోటలో
ఒదిగిన మహారాణులు !

ఆప్యాయతను పంచితే
అనురాగ దేవతలు
ఆగ్రహం పెంచితే
అపర కాళీమాతలు !

వీరసైనికులను కన్న
ధీర మాతలు
వీరకిశోరాలను పెంచిన
చైతన్య మూర్తులు !

మది చీకటిలో
వెలుగులు నింపుతారు
మసక తెరలో
దీపమై వెలుగుతారు !

ఆనందం ఉందంటే
స్త్రీ ఉన్నట్లే
అనురాగం దొరికిందంటే
అమ్మ ఉన్నట్లే !

బుడిబుడి నడకలతో
నట్టింట్లో తిరుగుతుంది
ప్రేమానురాగాలతో
మనసును నింపుతుంది !

పుట్టింట్లో పెరిగి
క్రమశిక్షణ నేర్పుతుంది
మెట్టినింట్లో తిరిగి
సంస్కారాన్ని నేర్పుతుంది !

వంశోద్ధారకున్ని ఇచ్చి
వంశాన్ని నిలబెడుతుంది
ఒడిదుడుకులను అధిగమించి
కుటుంబానికై శ్రమిస్తుంది !

భూదేవికున్నంత ఓర్పుతో
బాధని భరిస్తుంది
ఆకాశమంత నేర్పుతో
ఇంటిల్లిపాదిని రక్షిస్తుంది !

భర్త లేకున్నా
బాధని భరిస్తుంది
తోడు లేకున్నా
బిడ్డల్ని కాపాడుతుంది !

కాలానికి ఎదురీదుతూ
బ్రతుకునీదుస్తుంది
కల్లోలాలను దాటుతూ
తీరాన్ని చేరుస్తుంది !

తల్లిగా చెల్లిగా
ప్రేమను కురిపిస్తుంది
ఆలిగా ప్రియురాలిగా
అక్కున చేర్చుకుంటుంది !

ఎన్ని అడ్డంకులెదురైనా
సహనాన్ని కోల్పోదు
ఎన్ని కష్టాలపాలైన
చిరునవ్వు వీడదు !

సందడి చేసి
సంతోషాన్ని పంచుతుంది
అలిగి దూరమైనా
ఆప్యాయత కురిపిస్తుంది !

అరాచకం చేసినా
అక్కున చేర్చుకుంటుంది
అవమానపరిచినా
అనురాగం నింపుతుంది !

వ్యక్తిత్వాన్ని కోల్పోతే
వ్యక్తిగా మరణిస్తుంది
వ్యక్తిత్వాన్ని మంటగలిపితే
శక్తిగా నిలుస్తుంది !

వరకట్నపు సంతలో
బలిపశువవుతుంది
అత్తింటి జ్వాలలో
సమిదయిపోతుంది !

సంసార సాగరానికి
చుక్కాని నావ
బతుకు బండికి
చక్కని తోవ !

కాళ్లకు గజ్జెకడితే
ఆనంద స్వరూపిణి
కాళ్లకు సంకెళ్లే?స్తే.
శక్తి స్వరూపిణి !

వాడుకొని వదిలేస్తే
తాట తీస్తుంది
వేడుకొని ప్రార్థిస్తే
వరాలు ఇస్తుంది !

ఆప్యాయత కొరకై
ఎదురు చూస్తుంది
ఆత్మాభిమానం కొరకై
అసువులు బాస్తుంది !

భయం గుప్పిట్లో
బంధీ అవుతుంది
భవిత చీకట్లో
బూడిదౌతుంది !

ఏమీ ఆశించకుండా
అన్నీ ఇస్తుంది
తనకేమీ లేకున్నా
ఊరుకుంటుంది !

ఆయుధం లేకుండా
బ్రతుకుపోరు సాగిస్తుంది
మడమ తిప్పకుండా
నిత్యం పోరాడుతుంది !

కల్లాకపటం ఎరుగని
ఖర్మ జీవులు
కలిసి ఉండాలని
కోరుకునే ఆత్మీయులు !

అనుబంధం విలువల్ని
పెంచి పోషిస్తుంది
అనురాగపు తీరాల్ని
ముద్దాడుతుంది !

రాజ్యాంగ పాలనను
చక్కదిద్దుతుంది
అధికార పీఠాన్ని
అందిపుచ్చుకుంటుంది !

బడుగుల జీవితాలను
బాగా నడిపిస్తుంది
అణగారిన బిడ్డలను
అమ్మగా పోషిస్తుంది !

అత్తింటి వారిని
అక్కున చేర్చుకుంటుంది
ఆడపడుచుల మర్యాదను
లోటులేకుండా తీర్చుతుం !

అత్యున్నత పదవుల్లో
ఉన్నతంగా రాణిస్తుంది
ప్రజల కష్టాలలో
పాలుపంచుకుంటుంది !

సంస్కృతిని పెంచుతూ
సమాజానికి తోడ్పడుతుంది
సంప్రదాయాన్ని పంచుతూ
ఆచారాల్ని పాటిస్తుంది !

అందరి అభిరుచుల్ని
గౌరవించి తీరుస్తుంది
కుటుంబాల మదిని
ప్రేమతో దోచేస్తుంది !

తాను అలసిపోయినా
అవసరాలను తీరుస్తుంది
ఆరోగ్యం బాగా లేకపోయినా
అన్నీ చేసి పెడుతుంది !

ప్రసవవేదన ఎంతున్నా
తట్టుకొని నిలుస్తుంది
మరణించే అవకాశమున్నా
మరొకరికి జన్మనిస్తుంది !

ప్రాధేయ పడితే
పాపుల్ని క్షమిస్తుంది
పగ బడితే
పాతాళానికి తొక్కేస్తుంది !

హక్కుల కొరకై
పోరాడుతుంది
సమాన స్థాయికై
కృషి సల్పుతుంది !

మూఢాచారాల నిర్మూలనకై
ముందుకు నడుస్తుంది
చైతన్యాన్ని కలిగించడానికై
పిడికిలెత్తి సాగుతుంది !

కుర్రకారు వేధింపులకు
ఎదురొడ్డి తీరుతుంది
యువతీ యువకులకు
ఐకాన్గా నిలుస్తుంది !

సామాజిక న్యాయాన్ని
బహిరంగంగా చర్చిస్తుంది
లింగ సమానత్వం
ఇంటి నుంచే ఎదిరిస్తుంది !

గాయం చేసినా
సాయం చేస్తుంది
దాడి చేసినా
దయ చూపుతుంది !

సాంకేతిక రంగాల్లో
ముందుగా నడిచింది
సాహితీ రంగాల్లో
మేటిగా నిలిచింది !



–రవి చంచల
8500330700

## అమ్మ

తొమ్మిదినెలల పాటు మోసి మోసి
పురిటినొప్పుల నరకాన్ని దాటి
నాకు ప్రాణం పోసిన అమ్మ
నాకు జీవితాన్ని ఇచ్చిన భూమి
మీద దేవత!

కనిపించని దేవతలకు పూజలు జేసి
కనిపించే దేవతమ్మకు
కనీసం ఆదరణ చూపలేరు
ఎందుకంటే
దేవతలు వరాలిస్తారనీ పూజిస్తారు
గుండెలోని ఊపిరి
అమ్మ పూదిన
గొప్ప వరమని తెలుసుకోరెందుకో!?

అమ్మలు ఎవరైనా
స్వార్థం లేని ప్రేమకు చిరునామా
ఆమె
మనకిచ్చిన ప్రేమలో
రవ్వంత
ఆఖరి దశలో ఇచ్చినా
మన జన్మ ధన్యమే..!



–మెట్టునాగ లోహిత్ వెంకటస్వామి
6 వతరగతి, ఎంవీ ఆర్ విద్యానికేతన్,
బయ్యనగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

## దేవుడా..! నన్ను నేను తెలుసుకున్నాను..!

## నీకు శలవ్



–డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

మనిషికి చాలా కాలానికి భయం కలిగింది
పంచేంద్రియోన్మాదం మనిషి కనులు కప్పింది
సామ్రాజ్యవాద భావన పాలకులకు అహం తెచ్చింది
మనుష్యులందరూ ప్రకృతి జీవులే
పంచభూతాలను ధ్వంసించుకున్నారు
నీటిని కలుషితం చేశారు, వాయువును కల్మషం చేశారు
చివరకు వెలుగును కూడా చిదిమే ప్రయత్నం చేశారు
నేలను రోగగ్రస్తం చేశారు
క్రిమిసంహారక మందులతో భూసారాన్ని దెబ్బతీశారు
అయ్యో! వెంకన్న దర్శనం ఆగిపోయిందా!
మీ ఆగమ సూత్రాలన్నీ ఏమైనాయి
స్వామి పవళింపు సేవలు,
లడ్డూ పంపకం, కోనేటి మునకలు,
పొల్లు దండాలు ఏమయ్యాయి స్వామీ!
మానవులు వినోద ప్రియులు
మీ దగ్గర వినోదం వుంది
ఆహార ప్రియులకు
మీరు లడ్డూలు పెడుతున్నారు
స్వామీ! వీరికి శాస్త్రజ్ఞానం అవసరం
అది లేకుండాపోయింది.
ఎలా కలుగచేయాలో మీరే సెలవియ్యాలి స్వామీ!
మీ దర్శనం ఆపాక ఎవరిళ్ళల్లో వాళ్ళు గడుపుతున్నారు
అన్ని దేవాలయాల్లో దేవుళ్ళను చూడటం ఆపారు
తమ కుటుంబాన్ని కంటారా చూసుకున్నారు
నోటారా మాట్లాడుకుంటున్నారు
మనుషులంతా దేవాలయాలకు, చర్చిలకు,
మసీదులకు అలవాటు పడ్డారు
దైవ సంబంధాలు పెరిగి
మానవ సంబంధాలు తగ్గిపోయాయి
ఇప్పుడు కరోనా వైరస్ వచ్చింది
అది పెద్ద ఉప్పెనలా వచ్చింది
ఏ దేవుడు మానవ ప్రాణాన్ని రక్షించలేకపోతున్నాడు
ఎందుకు స్వామి?
దేవుడిని మానవుడు సృష్టించాడు
దేవుడికి మానవుడు అధీనుడయ్యాడు
తనకున్నదంతా సమర్పించుకున్నాడు
చివరికి బుద్ధిని కూడా దేవుడికిచ్చేశాడు
దీనితో వైరస్‌కి మూలం అర్థం కాలేదు
అందుకే, ఒకసారి దేవాలయాలన్నీ
మూసి ఆలోచిస్తున్నాడు
మనిషి పుట్టుక, మరణాలకు
మూలాలు ఎక్కడున్నాయి?
అని వెతకటం ప్రారంభించాడు
'ప్రకృతిలో వున్నాయని' అర్థం అవుతుంది
ప్రకృతి నుండి జనించి ప్రకృతిని
ధ్వంసం చేశాడు కదా!
మరి ప్రకృతిలో ఇతడూ భాగమే కదా!
మరి! ఏమి చెయ్యాలి
'మానవుడు శాస్త్రజ్ఞానాన్ని పెంచుకోవాలి'
అని తెలిసింది
'దైవజ్ఞానం అబద్ధం అని రుజువు అయ్యింది' స్వామీ!
మీ దర్శనాన్ని ఆపటం వల్ల లాభమే గాని
నష్టం జరగలేదు
ఇక చర్చిలు మూఢవిశ్వాసాల ఊబిలో
కూరుకుపోయాయి
'కూడిక' ప్రమాదం, ప్రార్థన వ్యర్థం
అని తేలిపోయింది
ఇక మానవుడు శాస్త్రం వైపు చూడాలి కదా!
తాను జీవించాలంటే తన శ్వాసలో స్వచ్ఛత,
తన శరీర శక్తిలో బలం ఉండాలి
ఒక వేప, ఒక ఉసిరి, ఒక దానిమ్మ
ఈ దేవుళ్ళ కంటే గొప్పవని తేలింది
పాలు, తేనె, ఉలవలు, పెసలు శరీరానికి
శక్తిని ఇస్తాయి
దేవుడా! నిన్ను ఇక నేను వదిలిపెడుతున్నాను
నన్ను నేను ప్రేమిస్తున్నాను
నా ఇల్లే నాకు వైజ్ఞానికశాల
నా మేథస్సు నాకు శక్తి
ప్రకృతిలో భాగం అవుతున్నా..!
నాకు విజయం తథ్యం..!

అగుపడేదానితో ఎవ్వరైనా యుద్ధం చేస్తారు.
కనబడనిదాంతో పోరుకెట్లా దిగుతారు?

కంటికి కనిపించని శత్రువొకటి బయట
వాహనం కోసం కాచుకునుంది.
లక్ష్మణరేఖ దాటావా.......!
నీపైకెక్కి నీ ఇంటిలోన దిగుతుంది.

శత్రువుతో పోరాటానికి ఆయుదాలు కావాలి.
అస్త్రాలకు అనేక రూపాలు....
ఇప్పుడు పెద్దలు చెప్పే మాటలే
నీ ఆచరణలో ఎక్కుపెట్టే
వదిలే బలమైన బాణాలు.

-మునిమడుగుల

## అమ్మ

నవమాసాలు మోస్తూ నిత్యం పరితపిస్తేనే
ముద్దులొలుకు పసిడి నవ్వు భువిపైకి వచ్చేది
మనిషిని సృష్టించు అమృతహస్తము అమ్మ

ఆకలిని మరిచి అనునిత్యం పరితపిస్తేనే
అనురాగాల పొదరిల్లులో బాల్యం గడిచేది
బాల్యానికి నిజమైన భరోసా నిచ్చేది అమ్మ

రక్తబంధాల్లోని మధురిమను ఉగ్గుపాలతో కలిపి పోస్తేనే
రక్షాబంధముతో కలకాలము కలిసి మెలిసి ఉండేది
పవిత్ర బంధాన్ని తరతరాలకు అందించు అనురాగపు పందిరి అమ్మ

కష్టాలు కడుపులో దాచుకోని సుఖాలను అందిస్తేనే
విలువైన చదువు తల్లి బిడ్డకు చేరేది
అక్షరాలు నేర్పు తొలిగురువు అమ్మ

గుండెల్లో దాచుకొని కలకాలనీ అనురాగనీ పంచితేనే
కష్టముల లోగిలిలో బిడ్డ ఓదార్పు పొందేది
పుడమి లోగిలిలో నిత్యం ప్రేమను పంచు కల్పతరువు అమ్మ



–సిహెచ్. ఉషారాణి
9441228142

## పోయేదేముంది

అదేందోగాని
జరిగిన సంఘటనలే మళ్ళీ మళ్ళీ జరుగుతున్నప్పుడు
చెప్పిన మాటలే నొక్కి నొక్కి చెప్పక తప్పడం లేదు
కామంతో కళ్ళు మూసుకపోయి
కబందుల్లా వ్యవహరిస్తున్న
క్రూరత్వాన్ని కవిత్వంతో
కుల్లబొడిచి చంపాలనిపిస్తుంది
రాక్షసత్వం రంకెలేస్తూ నారీమణులను
రాసిరంపాన పెడుతున్నప్పుడల్లా
రాసిందే రాయక తప్పడంలేదు!
ఆడవాళ్ళనూ బతుకనిద్దాం!
అహర్నిశలు మన బతుకు గోరేవాళ్ళు
ఆకాశంలోనూ అవనిలోనూ సగభాగమైన వాళ్ళు
సృష్టికి, వృష్టికి, రక్తికి, అనురక్తికి మూలమైన వాళ్ళు
మానవకోటి మనుగడకు మూల స్థంబాలైన వాళ్ళు
ఇంటికి దీపాలై ఇల్లంతటిని రక్షించే వాళ్ళు
కంటికి రెప్పల్లా కన్నవారిని రక్షించేవాళ్ళు
అనురాగ దేవతలైన ఆడవాళ్ళనూ బతకనిద్దాం!

మూలమలుపుల్లో మాటువేసి
మహిళల మానాభిమానాలను దోచుకుని
హత్యలు చేసే
మానవ మృగాలను మట్టుబెట్టి మూల విరాట్టులమై
వాళ్ళమానాన వాళ్ళనూ బతుకునిద్దాం.

యత్రనార్యస్తూ పూజ్యతే తత్ర దేవతారమంతె
కలకంటి కంటనీరు ఒలకంగా అని
పెద్ద పెద్ద శ్లోకాలను వల్లించలేను
కాళిదాసులాగా కమనీయ ఉపమానాలు చెప్పలేను
అల్లసాని వారిలా అల్లిక జిగిబిగి చేయలేను
అందమైన ఊహల్లో ముంచి
ఉబ్బి తబ్బిబ్బు చేయలేనువిషపు కోరల కరోనా
పార్లమెంటులో మహిళా బిల్లు పాస్ చేపిస్తాం అని
రాజకీయ ఉపన్యాసాలు చేయలేను
బేటి బచావో, బేటి పడావో అనే
లిమాటలు చెప్పలేను
ముక్కు సూటిగా చెప్తున్న ఒక్కటే నా మాట
అహర్నిశలు మన బతుకుల్ని కాపాడే
ఆడవారిని బతుకనిద్దాం!

వెన్నెల్లో వారిఆటల్ని ఆడనిద్దాం
కోయిలల్లా పాడి వారిపాటల్ని పాడనిద్దాం
నెమళ్ళలా నాట్యమాడే నృత్యాలను చూసి తరిద్దాం
విశ్వ వీధుల్లో వారు సాధించే విజయాలకు
జేజేలందాం
ఆది అబలకాదు సబలయని
చాటు కొనుటకు అవకాశమిద్దాం
ఆడవారిని అంగడి సరుకును చేసి ఆడించే
స్వార్థపరుల్ని చావిట్లో పాతేసి
మానవ మృగాల్లనే అపవాదులను తొలగించుకొని
మగ మహారాజుల్లా బతుకుతూ
స్త్రీలపై అత్యాచారాలు హత్యల్లేని
వాస్తలకై, ఎదురుచూస్తూ
వాళ్ళ మానానవాళ్ళనూ బతుకనిద్దాం
పోయేదేముంది!



– డా॥ కూర్మాచలం శంకరస్వామి
సెల్: 7702435110

## కాలం గీసిన మృత్యు రేఖ

కాలం కలిసిరాక
ప్రకృతి విపత్తులను సృష్టించినప్పుడు
తలవంచక తప్పదు
పరిస్థితులు ప్రతికూలమైతే
ఆపద దాగి ఉండదు
ఓ! మానవా!
చరిత్ర గుర్తుంచుకో
ఎంతటి బలశాలినైనా
అవలీలగా అంతమొదించే
వాలి కథ జ్ఞప్తికి తెచ్చుకో
బ్రహ్మాండాన్ని శాసించగల
బ్రహ్మాస్త్రాలు కలిగిఉన్నా
శ్రీరామచంద్రుడు
వాలిని వధించిన తీరు గుర్తుందా?
ప్రస్తుత ప్రపంచాన్ని
మృత్యుభ్రాంతులకు గురిచేస్తున్న
కరోనా కరాళాపాశం అలాంటిదే
ఎదురుపడినవాడు ఎంత ధీరుడైనా
మట్టిని కరిపించే ఆ మహమ్మారిని
గుట్టుగా దాగి మట్టుపెట్టాల్సినదే
అది కంటికి కనిపించని
ఓ నిర్జీవ కణమైనా
మనిషిని వాహకంగా మార్చుకొని
సజీవమై విస్తరిస్తుందని బోధపడింది.
ఇప్పుడు ప్రత్యక్ష యుద్ధం పనికిరాదు
గుప్తంగా చేయు రణమే
ఈ మహమ్మారిని ఎదుర్కొనే మార్గమని
మనకోసం మన కుటుంబాల కోసం
సమస్త మానవాళి మనుగడ కోసం
బయటకు రాకుండా
ఉండడమే ఉత్తమమని
సామాజిక దూరాన్ని పాటిస్తూ
ప్రభుత్వ నిబంధనల్ని అనుసరిస్తూ
వైద్యుల సలహాల్ని స్వీకరిస్తూ
అందరికోసం ఒక్కరమై
ఒక్కరికోసం అందరమై
ఐక్యంగా సంఘటితంగా
కరోనా మహమ్మారిని కట్టడిచేయడమే
మన కర్తవ్యమని తెలుసుకో
ఓ! మానవా!
తెలివిగా ఆలోచించు
సమయస్ఫూర్తితో వ్యవహరించు
అనువుగానిచోట
అధికుడ ననవద్దు
కొంతకాలంపాటు
అద్దంలో కొండలా
కొంచెమై వుండు
ప్రకృతి అనుకూలించేదాకా
అణుకువగా వుంటూ
ఏనాటికైనా
ప్రకృతితో చెలిమే
మనిషి కర్తవ్యమని
మానవాళికి
శ్రేయోధాయకమని భావిస్తూ
కాలం గీసిన మృత్యు రేఖను
హెచ్చరికగా గుర్తిస్తూ
సహనంతో, మనోనిబ్బరంతో
విషవైరస్‌పై
విజయాన్ని సాధించు!



–డా॥ సమ్మన్న ఈటెల
సెల్: 9885238654

## దేవుళ్ళు తలుపేసుకున్నారు

కంగారు పడి
కొండమీద దేవుళ్ళు
తలుపేసుకున్నారు
ఊళ్ళో దేవుళ్ళు
తలుపు చాటునుండి
చూస్తున్నారు.
కానీ...
వైద్యుడు మాత్రం ధైర్యంగా
సాటి మనిషికి సేవచేస్తున్నాడు.

కరోనా దెబ్బకి ఉలికిపడి
మూఢనమ్మకాల మత్తు నుండి
జనులు రాలి పడుతున్నారు
మంత్రాలకు చింతకాయలు
రాలవని
మన వైద్యులు మరోసారి
నిరూపిస్తున్నారు.



-కవిత్రీ
9493785596.

## కూల్చవచ్చు

క్షణం తీరిక లేదంటు
తిరుగుచుండిన జనం
ఇంట నుండ నేడు తప్పు లేదు
అవసరానికే బయటకు పోయె గుణ ముండుంటె
తిప్పలెన్ని నేడు తప్పు చూడు
ఆట,పాటలకంటు ఆరు బయట తిరగ
ప్రాణానికే ముప్పు వచ్చె చూడు
క్రమబద్ధ జీవితమే కడదాక నిలుచూను
కర్మ యె?గిగా నీవు బ్రతికి చూడు
నా కోసం అనకుండ మన కోసం అనియుంటె
ఆపదలు ఎన్నొ తగ్గు చూడు
ప్రకృతి కన్నెర్ర చేసిన నాడు
నీ ధనం, హోదాలు నిన్ను కాపాడ లేవు.
కలిసి బతికిన మనకు కలదు సుఖంబంటు
కదలుదాం జగతి మేలు గోరి.
కలసి కట్టుగా ఉంటె కరోన మనకెంతా.
పారి పొవును మన పట్టు చూసి.
పద్దతిగా బతికితె ప్రమాదకర రోగాలు
దరిదాపులొ మనకు. కానరావు.
వచ్చినా వాటిని
కూకటి వ్రేళ్ళతొ కూల్చవచ్చు



– గుండం మోహన్ రెడ్డి
9440161636

## శ్రమజీవి నరుడు

వైభవ భండారం ప్రకృతిలో
మస్తుగా నిండిఉంది
ఆశించిన సంతస–భోగాలు
స్త్రీ–పురుషులు పొందగలరు సహజంగానే.

అందరూ తృప్తి చెందగలరు.
అన్ని సుఖాలు పొందగలరు సమానంగా
అనుకుంటే– క్షణంలో భువిని
చేయగలరు స్వర్గంగా.

ఆవరణకింద అన్ని తత్వాలను
దాచి ఉంచాడు దేవుడు
వాటిని సంఘర్షణలతో వెదికి
వెలికి తీసాడు శ్రమజీవి నరుడు.

బ్రహ్మ రాసాడు కొంత నొసట
నరుడు తేలేదు దానిని(వైభవాన్ని)
తన సుఖాన్ని తానే
తన బాహుబలంతో పొందాడు.

వైభవ శక్తికి భయపడి
ప్రకృతి ఎప్పుడూ లొంగిపోదు
మానవ శ్రమకు, శ్రమ జలానికే
సదా అది ఓటమి చెందుతుంది.
సోమరులే విధి రాతను
చదువుతూంటారు
వీరులు నొసటి చెడురాతను (దౌర్భాగ్యాన్ని)
తమ నొసటి (శ్రమ) బిందువులతో
తుడిపేస్తారు.

భాగ్యవాదం పాపావరణం
మరియు శోషణాస్త్రం
దానిద్వారా ఒక మానవుడు

–కీ.శే. రామ్‌దారీ సింహ దిన్‌కర్

మరొక మానవుణ్ణి అణగగొడ్తాడు.

అడగండి ఏ భాగ్యవాదినైనా
విధిరాత బలిష్ఠమైనదైతే
స్వతహాగా భువి తన రత్నాలను
ఎందుకు పాదాక్రాంతం చేయదు?

ప్రకృతిని అది నీటితో తడిపి తడిపి
భాగ్యాన్ని ఎందుకందిస్తుంది?
వైభవబలంతో కూడబెట్టిన భండారాన్ని
అది ఎందుకు లేపుకోలేదు?

ఓ మానవుడు, కూడబెడ్తాడు
పాపవిత్తపు బలంతో
మరొకండు దానిని అనుభవిస్తాడు
భాగ్యవాద (అదృష్టవాద) కపటంతో
మానవ సమాజానికి భాగ్యమొక్కటే–
అదే– శ్రమ, బాహుబలం
తలొగ్గాయి వినయంగా
నేల, నింగి వాటికే.

శ్రమజలంతో (స్వేదంతో) అందించిన దానిని
వెనుకపడనీయొద్దు
అన్నిటికంటె ముందుగా ప్రకృతిని
జయించిన దానికి సుఖాన్ని పొందనివ్వు.



తెలుగు సేత: – **అమర్‌జీ**
సెల్: 9620186222

## అమూల్యం

అందచందాలు పంచే ఆనందం
ఆత్మీయతగా పలుకరిస్తూ సంతోషం
వేదనలో ఓదార్చే అనుభవం
పశ్చాత్తాపంతో మారిన హృదయం
అమూల్యం.. అమూల్యం!!

ఆకలి బాధను తీర్చే ఆహారం
ఆధ్యాత్మికతను పెంచే ధాన్యం
ఎదుటివారిని క్షమించే క్షమాగుణం
అనాధలను ఆదరించే ఆత్మీయం.. ॥అమూల్యం॥

చెలిమలలో లభించే త్రాగే జలం
కష్టసుఖాల్లో పొందే ధైర్యం
సంతోషానిచ్చే కవిత వ్రాసే కలం
రైతన్నలు పంటలు పండించే పొలం
అమూల్యం.. అమూల్యం!!



**–డా॥ కర్నాటి లింగయ్య**
సెల్: 9515298610

## మధుర వాణి

అష్టాక్షరి మంత్రము అవనిలో అందమే
పంచాక్షరి మంత్రము భువనిలో అందమే
హరిహరాధుల నామ స్మరణను నిత్యము
అవగతము చేసుకుంటే ఆత్మా నందమే

ఒరవడి గను ఈకాలన అందమే
ఒరపరి గను ఈలోకాన అందమే
కుసంస్కారమునకు తావివ్వని విలువతో కూడిన
సంస్కార వంతులను జూడగామది ఆనందమే

మన తెలుగు వాచకము అందమే
మనుగడైన ఉప వాచకము అందమే

తేనెలొలికే పలుకులు పంచే మనయాస
మాతృభాష మన తెలుగుభాష అందమే

అంతరార్థం తెలుసు కొవడం ఆనందమే
అంతర్యామిలో కలిసి పోవడం ఆనందమే
అలసిన మనసును ఆడించిన నీలీలలు
సొలసిన ఈతనువు నీలో
ఐక్యమవుట ఆనందమే

**–కళ్యాణాచార్యులు బెజ్జారపు.**
9494728758

## నిజమా?

ఉదయిస్తె ఉప్పటికైనా
అస్తమించాల్సిందే!
ఉదయాస్తమానాలన్నపుడు
విశ్రమించక–
పరిభ్రమించాల్సిందే!
మేఘమై కమ్మినపుడు
చీకట్లు ముసిరినా
తేలి పోవాల్సిందే!
నీరై నిలిచినపుడు
జఢమై వుండక–
ఇంకి–ఇగిరిపోవాల్సిందే!

ఉధృత కరటమై లేచినపుడు
కుదురుగ వుండక–
ముందుకు సాగాల్సిందే!
వాయువై వీచినపుడు
నిశ్చలంగ వుండక–
చలించాల్సిందే!
మానువై మొలిచినపుడు
నిస్తానువుగ వుండక–
గాలికి ఊగాల్సిందే!
అగ్ని రూపమేదైనా
ఆరక–

దహిస్తూ వుండాల్సిందే!
మనిషై పుట్టినపుడు
భవబంధాలకు వెరవక–
నటించి నిష్క్రమించాల్సిందే!



**–పి. బక్కారెడ్డి**
సెల్: 9705315250

## మనిఫూసలు

నింగి మెరుపు మెరసిన
పెళ పెళమని ఉరిమిన
పుడమి పులకరించదా
వానకంత తడిసిన

మాట కున్నది బలము
మనిషికదే ధైర్యము
వాదంబు లేన్నొ జేసి
వాక్కు గెలుచును నిజము

పాటకున్నది ప్రాణము
గాయకునిదే గానము
ప్రేరణ కలిగించునంత
మనిషి వీడును మానము

వినెవాడికి సూక్తులు
వినిపింతురు వ్యక్తులు
ఆచరించని వారే
అవుతున్నరు వక్తలు

మనిషికి మాటె బలము
రాజుకు కత్తె బలము
ఊహకు రెక్కలొచ్చిన
కవికి కలమే బలము

చేనుకు కంచె కాపు
పండిన మంచె కాపు
వొడిసెలతో రువ్వి రువ్వి
కావలి పొద్దు మాపు

ఆహార్యమే గంభీరము
మాటలన్ని మాధుర్యము
కనపడని గోతులతో
నీతులన్ని సోపానము

మనిషిని వెలిగించు మాట
మందినంత మల్పు మాట
దేశాలన్ని దాటుతు
మనిషి నడిచె– ప్రగతిబాట

బాల్యమంత ఆటలాడు
యవ్వనమున నీకు జోడు
తప్పటడుగు వేసినావో
తగ్గునోయి నీదు ఈడు.

మధుమాంసములే వద్దు
ఆకుకూరలే ముద్దు
పోషకాలు యెన్నొన్నొ
కూరగాయలే ముద్దు.



**– అన్నల్‌దాస్ రాములు**
సెల్: 9949553655

## ఈ డారెటు

మంచీ చెడూ రెండూ
విడమర్చి చెప్పడం
ఎవరిరి సాధ్యమౌతుంది.

కొందరి దృష్టిలోని మంచి
మరికొందరి దృష్టిలో
చేతకాని తనం అయ్యి కూర్చుంది

కొందని దృష్టిలోని చెడు
మరికొందరి దృష్టిలో
బతకనేర్చిన తనమై వర్ధిల్లుతుంది
చెడు బతక నేర్చు అని
భ్రమించి నంతకాలం
దుష్టత్వం ప్రభలుతుంది

మంచి చేతగాని తనమని
తూలనాడి నంతకాలం
భవిష్యత్ అంధకార మౌతుంది
చీకటి రాజ్యమేలుతుంది.



**– వి.సూర్యారావు**
సెల్: 92469 11234

## నగరభారం

నగరం నగరం గరంగరం
నగరభూములు ప్రియం ప్రియం
నగర జీవితం కలవరం

ఉద్యోగం ఉంటే ఆనందకరం
చిరుద్యోగికి అవుతుంది భారం
నిరుద్యోగ మోస్తాడు పనుభారం ॥నగరం॥

సిటీలో ప్రయాణం ఇబ్బందికరం
రద్దీలో ప్రయాణం ప్రమాదకరం
ట్రాఫిక్ సమస్యకు ఏది పరిష్కారం

రణగొణధ్వనుల హెూరు
కలుషిత వాయువుల జోరు
మనిషి అవుతాడు బేజారు.

చాలచాలని కుళాయి నీరు
అందీ అందని నిరంతర పవరు
చూసీ చూడని నగరమేయరు.

**– కె. ప్రేమలత**
సెల్: 9491950732

పుస్తక సమీక్షలు

# యానాం కవితల సమాహారం...

ప్రముఖ కవి శిఖామణిగారు యానంతో ముడిపడివున్న తమ అనుభవాలను.. అనుభూతులను.. ఆలోచనలను అక్షరాల్లోకి ఒంపి.. మనకు "యానాం కవితలు" గ్రంథం ద్వారా అందిస్తున్నారు. యానంతో పెనవేసుకున్న తన అనుబంధాన్ని.. కవి శిఖామణిగారు అక్కడి ప్రజల స్వభావాలు.. వ్యక్తిత్వాలు.. మనస్తత్వాలను మానవీయ కోణంలో సార్వజనీన మైతిలో ఆవిష్కరింప యత్నించారు. యానాంఫ్రెంచ్ వారి పాలన నుండి మద్యానికి.. పద్యానికి కేంద్రమవ్వడం గమనిస్తున్నాం. శిఖామణిగారి కవిత్వంలో అక్కడి ప్రాంత ప్రజల జీవన విధానం.. అక్కడి మట్టిపై ఉన్న మమకారం.. తమ మదిలో సవ్వడి చేసె యానాం జ్ఞాపకాలను కవితల సమాహారంగా పాఠకులకు అందించారు. కవి తమ వైయక్తిక అనుభవ స్పర్శతో పాటు.. సామాజిక స్పృహతో ఇందలి కవితలకు జీవం పోశారు. స్థానికతకు పెద్దపీట వేస్తూ.. తమ ప్రాంత సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ఆప్తులను.. స్నేహితులను. . గురువులను.. బంధువులను హృదయం లోతుల్లోంచి స్మరిస్తూ.. వినమ్ర పూర్వకంగా తమ గౌర వాన్ని.. ఆరాధనా భావాన్ని.. ఆత్మీయంగా ఇందలి కవితల్లో ఆవిష్కరించారు. శిఖామణిగారి కవిత్వంలో మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న తపన కానవస్తుంది. ఆయన కవిత్వం పైకి నాస్టాల్జియాలా కనిపించినప్పటికీ.. వాస్తవంగా యానాం మట్టికి.. అక్కడి మానవ సంబంధాలకు శిఖామణిగారు అక్షర హారతి పట్టారు. కవి స్వస్థానం విడిచి మూడు దశాబ్దాలు దాటినా.. అక్కడి జ్ఞాపకాల దొంతరలను అక్షరాల్లో బంధించ యత్నించడం అభినందనీయం.



అమ్మ ప్రేమను పరిచిన నరసమ్మను యానాం సరస్వతిగా భావిస్తూ.. రాసిన కవితలో కవి యొక్క ప్రతిభను చూడగలం.. నరసమ్మగారితో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుంటూ నరసమ్మను ఉన్నతంగా చిత్రించారు. **నరసమ్మ గారూ..!మీరు లేని యానాం/ ఇప్పుడు/ సరస్వతి లేని బాసరలా ఉందని** అర్థవంతమైన ముగింపు నిచ్చారు. చాప్ప మీద రాసిన కవితలో చాప్ప వ్యక్తిత్వాన్ని.. మూర్తిమత్వాన్ని.. కవితాత్మకంగా ఆవిష్కరించారు. **'ముత్యాలుగారి నిలువటద్దం'** కవితలో ముత్యాలుగారి అద్దంతో తమకున్న బంధాన్ని అందంగా చెప్పారు. చిన్ననాటి జ్ఞాపకాలను..మీరాతో వున్న స్నేహ బంధాన్ని.. పిన్న వయసులో ఆడిన ఆటలను.. ఓడిన ఘటనలను గుర్తు చేసుకుంటూ..మనందరినీ బాల్యంలోకి లాక్కొనిపోయేలా పద బంధాలను కూర్చి.. మన బాల్య జ్ఞాపకాలను సైతం ఏరుకునేలా "ఎందు తకొస్తావే..జ్ఞాపకానికి మీరా" కవితను తీర్చిదిద్దారు. ఈకవితలోని ప్రతి పంక్తి కవి యొక్క సృజనాత్మకతను.. అద్దం పట్టేలా కొలువుదీరడం విశేషం.

గోలీ కాయల నుండి గాజు గ్లాసుల వరకు.. హవాయి చెప్పుల నుండి గోడ అద్దాల వరకు బొంగరాల నుండి రబ్బరు బొమ్మల వరకు అక్కడ దొరకని వస్తువే లేదంటూ 'ఆరణాల షాపు' కవితను రాశారు. తమ బాల్య కలల ప్రపంచంలో రంగు రంగుల ఆరణాల షాపును కవిత్వపు హంగులతో మనకు అందించారు.

**'మా వూరి మరిడమ్మ'** కవితలో ఆసక్తికర అంశాలను పొందుపరిచారు.

**"అతని స్పర్శ/ రాతి స్తంభంలో దాగిన/ సప్త స్వరాలు.. అతని కౌగిలింప/ హృదయంలో కోటి వాద్యాల సింఫనీ.."** అంటూ నాయనను ఉన్నతంగా చిత్రిస్తూ "నాయన–(1)" కవిత రాశారు. **"నాయన–(2)"** కవితలో.. నాన్నను తన జాగృత స్వప్నంగా అభివర్ణించారు. కలలనూ.. **కన్నీళ్లనూ/ కలగలిపి కడుతున్న/ నిద్రాదారం/ ఏ అపర రాత్రివేళో పుటుక్కున తెగుతుంది అంతే"** అంటూ కవితను చక్కగా ఎత్తుకున్నారు. కవిత్వానికి కాదేదీ అనర్హం అని శ్రీశ్రీ అన్నట్లు శిఖామణి **'పులస చేప స్వగతం"** శీర్షికతో కవిత రాసి మెప్పించారు. ఈ కవిత ముగింపు చాలా బాగుంది. **'నా జీవితం అంతమైపోతున్న బాధకంటే/ లక్షలాది జనుల రాసిక్యపు నోళ్లలో/ ఒక్క లాలాజల బిందువునై ఉదయిస్తున్నందుకు సంతోషిస్తాను"** అంటూ చేప స్వగతాన్ని వినిపించడం బాగుంది.

**కవిత్వం మనిషినీ మనిషినీ కలిపికుట్టే/ కనిపించని దారం/ ముగ్గురూ కలిసి నడుస్తే త్రిమూర్తులకు పోటీ/ మూడక్షరాలు కూడ బలుక్కుంటే గాయత్రికి సాటి** అంటూ రాసిన పంక్తులుత **"వాళ్ళు ముగ్గురూ"** కవితలో చక్కగా ఒదిగిపోయాయి. త్రిమూర్తులుగా దేవదానంరాజు, పి.ఎల్.ఆర్.స్వామి. సి.హెచ్.రాంలను అభివర్ణిస్తూ రాసిన ఈ కవిత మంచి సందేశాన్ని మోసుకొచ్చింది.

**'సన్ థియేటర్'** కవితలో చిన్ననాటి సరదా పనులను ఆవిష్కరించారు. మా యానంసన్ థియేటర్ నా టీనేజీ సాహసగాడు అని చెప్పుకోవడం బాగుంది.

**'ఆంతరంగికుని వుత్తరం'**లో బాధలను పంచుకున్న బాల్య సఖులను గుర్తుకు తెచ్చుకున్నారు. కాసింత బెల్లం ముక్కకీ ఒకింత కౌగిలింతకూ.. లంగా బొందుల.. బాహుబంధనాలు.. అలౌకికానందాల.. మానసిక యవని కాభ్యంతరాలను.. నిట్ట నిలువునా చీల్చిన కామమోహిత నిరుపేక్ష ప్రేయసులేరి అంటూ కొనసాగిస్తూ.. రాసిన పంక్తులు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి. ఇంకా ఈ పుస్తకంలోని **'పూలకుర్రాడు', 'నీలాటి రేవు', 'యోగులు మరణించరు", 'రంగునూ సన్నెకల్లు', 'విగ్రహాలు మాట్లాడుతాయి', 'చిరుమొలక', 'నదిని దాటాలి', 'జల సర్పం', "వాచవి", 'జెండా స్తంభం', 'నాన్నోపనిషత్', 'తాటాకు గదుల పెట్టె', 'అమ్మ', 'పొయ్యిరాజేస్తున్న అమ్మ", "బుల్లెయ్య హెూటల్", 'చలివేంద్రం", పొన్నచెట్టు వాహనం", "ప్రమిదకింద చీకటి",** తదితర కవితలు పుస్తకానికి నిండుదనాన్ని కూర్చాయి. పుస్తకం చివరన.. ప్రతి కవితకు సంబంధించిన నేపథ్యాన్ని 'కవితల వెనుక' శీర్షికతో అందించడంవల్ల పాఠకులు కవితల్ని సులభంగా అర్థంచేసుకోవడానికి వీలు కలిగింది. ప్రతి కవితకు శివాజీవేసిన చిత్రాలు అందంగా కొలువుదీరాయి. ఆలోచనాత్మక ముఖ చిత్రం పుస్తకానికి మరింత శోభను కూర్చింది.

వైయక్తిక విషాదాలను, సామాజిక విషాదాలను సృజనాత్మకంగా కవిత్వంలో నిక్షిప్తం చేయడంలో శిఖామణిగారు దిట్ట అని నిరూపించేలా ఈ పుస్తకంలో కొన్ని కవితలున్నాయి. ఇందలి కవిత్వంలో తాత్వికత, ప్రేమ, కరుణ, జ్ఞాపకాలు.. అడుగడుగునా కానవస్తాయి.

పుట్టిన ఊరును.. తనచుట్టూ అల్లుకున్న సంబంధ బాంధవ్యాలను.. అందంగా, ఆర్ద్రంగా.. సమర్థంగా కవీత్వీకరించడంలో శిఖామణిగారు సఫలీకృతులైనారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేద్దాం

ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ–
నవోదయ బుక్ హౌస్,
హైదరాబాద్.

**– దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

పెనుగొండ సరసిజ తొలికవితా సంపుటి

# కాగితాన్ని ముద్దాడిన కల..

కవి అంటే.. 'కవిత్వానికి ఆకాశమే హద్దంటూ చైతన్య కిరణాలు ప్రసరించే భానుడు" అని భావించే కవయిత్రి..పెనుగొండ సరసిజ **"కాగితాన్ని ముద్దాడిన వేళ"** పేరుతో.. తమ తొలి కవితా సంపుటిని వెలువరించారు. అరవైకి పైగా కవితలతో ముస్తాబై వచ్చిన ఈపుస్తకంలో.. కవయిత్రి వస్తు ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శించారు. అభివ్యక్తిలో ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. సమకాలీన సంఘటనలను ప్రతిబింబిస్తూ రాసిన ఇందలి కవితల్లో కవయిత్రి యొక్క ఉత్తమ వ్యక్తిత్వం సామాజిక చైతన్యం కోసం ఆమె పడే ఆరాటం.. మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న ఆమె తపన మనకు అడుగడుగున కానవస్తుంది.



మొదటి కవితలోనే.. ఆరుగాలం ఆత్రపడి కాశిన రైతు కాపలా సంగతులను.. రైతు పాట్లను, వారి అగచాట్లను.. ఓ కొత్త కోణంలో ఆవిష్కరించారు. రైతన్న వ్యథలను ఏకరువు పెట్టారు. రైతుపడే కష్టాన్ని 'తొలుసూరు బిడ్డ పుట్టినట్టు' కవితలో చక్కగా తెలియజెప్పారు.

**'ఏముంది గర్వకారణం?**
**ఎంతో కొంత ఏదో రూపంలో**
**పురుష పీడిత పరాయకొత్తం'** అంటూ మహిళల పట్ల చూపబడుతున్న వివక్షను రెండో కవితలో ఎండగట్టారు.

మా ఊరి నడిబొడ్డుకు నజరానావి నువ్వు అంటూ కరీంనగర్ టవర్‌ను ఉద్దేశించి రాసిన కవితలో.. వస్తు విశ్లేషణ..అభివ్యక్తి బాగుంది. **నా కన్నారానికి కాణాచివి నువ్వు/ మావూరి ఈఫిల్ టవర్‌వి నీవు ఇగ నాకు లవర్‌వి నువ్వు"** అంటూ ముగించారు.

తెలంగాణ భాషకు పట్టంకడుతూ కవయిత్రి సరసిజ రాసిన కవితలు ఈ పుస్తకానికి శోభను కూర్చాయి. "ఫించనమ్మా.. ఫించను. **"బాత్రూంలో బాయి', 'చెరువు ఏడుత్తాంది' 'అరుగు',** తదితర కవితల్లో కవయిత్రి సరసిజ తెలంగాణ పదబంధాలను ప్రయోగించి.. ఆ పదాలమాటున ఉన్న మాధుర్యాన్ని పాఠకులకు పంచడం ప్రశంసనీయం.

**'ఏకాంతం'** శీర్షికతో రాసిన కవితలో **'ఏకాంతం'** యొక్క ప్రయోజనాలను ఏకరువు పెట్టారు. మాటలు కరువైన వేళ.. ఆలోచనలకు తోడై.. పాఠాలు ప్రబోధిస్తుందనీ.. మనసును మధించి కవిత్వాన్ని రాయిస్తుందని చెప్పడం బాగుంది.

కవయిత్రి సరసిజ యొక్క కవితలకు ఊపిరి పోసిన.. **'ఎన్నీల ముచ్చట్లు',** కార్యక్రమాన్ని గుర్తు చేసుకుంటూ రాసిన కవిత ఆలోచనాత్మకంగా మలచబడింది. ప్రతి పున్నమినాడు కరీనగర్‌లో జరిగే 'ఎన్నీల ముచ్చట్లు' తమను ఊయలలో ఓలలాడించిందనీ.. చల్లని ముచ్చట్ల ఒడిలో ఆశ్రయమిచ్చిన కవితా మాతగా ఈ కార్యక్రమానికి ప్రస్తుతించారు.

**'తెలుపు'** కవితలో.. కవయిత్రి ప్రకటించిన భావాలు పాఠకుల్లో ఓ కొత్త ఆలోచనలకు తెరలేపే విధంగా కొలువుదీరాయి.

**'మనిషా.. రాయా?"** కవితలో మనిషిని రాయితో పోల్చి దాన్ని అవమానించవద్దని హితవు పలికారు. ప్రేమ లేని మనిషి హృదయం రాయిలా పగలదని వివరించారు.

గౌరీలంకేశ్ హత్యను నిరసిస్తూ కవయిత్రి సరసిజ.. రాసిన కవితలో క్షరం కానిది అక్షరమనీ..గౌరీలంకేశ్ స్వయంగా ఆమే ఓ అక్షరమని.. ఆమెను చంపినంత మాత్రాన అక్షరం క్షరం కాదనీ.. లక్షల అక్షరాలకు ఆమె మరణం చరణంగా మారుతుందన్న అర్థం ధ్వనించేలా రాసిన పంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి.

**'అందమైన ఆమూల"** కవితలో అమ్మను.. ఉన్నతంగా చిత్రించారు. అడక్కముందే అమృతాహారాన్నిచ్చే అక్షయపాత్రలాంటి చేతులు.. నిత్యం సూర్యున్ని ఓడించి మేల్కొనే ఆమె.. చంద్రునికి జోల పాటపాడిగాని సేదదీరదు అంటూ ఆమె గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. "ఆమెకు బాలేదు" కవితలో ప్రతి పంక్తీ ఆర్ద్రంగా మలచబడింది.

**"ఫించనమ్మా..ఫించను"** కవితలో ఫించనంటే ఎరికేనా?" లంచమిచ్చినా రంచనుగా.. రాని కాదు కాదు వచ్చే "టెన్షనే" ఫించను అంటూ తేల్చిచెప్పారు.

"సాప' కవితను ఆలోచనాత్మకమైన సందేశంతో ముగించారు. **అన్న ప్రాసనాడు అంబాడే పాపల/ పాదాలతో పావనమవుతావు/ వయసొచ్చిన ఆడపిల్ల/ సిగ్గులకు వంతపాడుతావంటూ** కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. సాపలు.. సిరిచాపలు..అవును.. అంటూ ఇలా ముగించారు. **"సిరి" ఉన్నదోటింట్లో 'సాప' ఉండదు/ "సాప" ఉన్నదోడింట్లో "సిరి" వుండదు** అని చెప్పడం బాగుంది.

'నిర్భయ' సంఘటనకు మూడేళ్ళు నిండిన సందర్భంలో కవయిత్రి సరసిజ రాసిన **'అమ్మా శిక్షించవా?"** కవితలో ప్రకటించిన భావాలు ఆర్తి,ఆర్ద్రతతో రూపుదిద్దుకున్నాయి.

అత్తారిల్లు జ్ఞాపకాలను "ఆకాశమంత జ్ఞాపకం' కవితలో చక్కగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. **"ఫ్రోజెన్ టియర్స్"** కవిత అందరినీ కదిలించేలా రాశారు.

**"వంటిల్లు"** కవితలో..వంటిల్లును మొదటిసారి ప్రయోగాలకు శ్రీకారం చుట్టే పడుచు ల్యాబొరేటరీగా అభివర్ణించారు.**"ప్రేమ వర్సెస్ ప్రేమ"** కవితలో.. మనసును మురిపించేది ప్రేమ.. మురిపించిన మనసును ముక్కలు చేసేదీ ప్రేమేనని తేల్చి చెప్పారు. కవిత్వానికి కాదేదీ అనర్హం అని శ్రీశ్రీ అన్నట్లు కవయిత్రి సరసిజ 'మెత్త"పై కవితను రాసి మెప్పించారు.

**"మూడు"** కవితలోని ప్రారంభ పంక్తులు.. ముగింపు పంక్తులు.. వాస్తవాలకు అద్దం పట్టాయి. కవితకు బలం చేకూర్చడానికి ప్రతిపంక్తీ దోహదపడేలా కవయిత్రి రాసిన తీరు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.

**"వెలయాలు"** శీర్షికతో రాసిన కవితలో నిత్యం నిశీధి సాక్షిగా వెలకట్టబడే వెలయాలి యొక్క వ్యథలను ఆర్తిగా ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరినీ కంట తడిపెట్టించే విధంగా కవయిత్రి సరసిజ పదబంధాలను నేర్పుగా, ఓర్పుగా ప్రయోగించి కవితా వస్తువుకు న్యాయం కూర్చారు.

తల్లిదండ్రులను తరిమేస్తున్న వంశోద్ధారకులపై ధ్వజమెత్తుతూ.. **'తల్లి ఆల్‌వైస్ పిచ్చిది"** కవితను రాశారు.

**"మళ్లీ జన్మిస్తా"** కవితలో **"చెత్తకుప్పలో నన్ను ఒదిగిన నాన్నను/ చెంప పగలగొట్టి అడిగే/ చైతన్యగా.. ఆడదాన్ని అంగట్లో అమ్మే కామంధులను/ అంత మొందించే కాళికగా మళ్లీ జన్మిస్తా** నంటూ రాసిన పంక్తుల్లో కవయిత్రి ప్రకటించిన ఆలోచనలు అభినందనీయం.

ఇంకా కవయిత్రి సరసిజ సంక్రాంతి, ఉగాది, బతుకమ్మ, పండుగ గురించి కవితలు రాసి ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాష్ట్రాలు వేరైనా మనుషులు విడిపోవద్దని హితవు పలుకుతూ **"నా ఆత్మ బంధమా"** కవితను రాశారు. ఇలా.. ఎన్నో కవితా పంక్తులు ఉదహరించడానికి ఈ సంపుటిలో ఉన్నాయి. ముఖ చిత్రం పుస్తకానికి శ్రీనిండు శోభను కూర్చింది. కవయిత్రి సరసిజ తమ మొదటి పుస్తకం ద్వారా మనముందుకు వచ్చినప్పటికీ.. అక్షరంతో ఆమెకున్న ప్రథమం కాదని చెప్పే విధంగా ఇందలి రచన కొనసాగింది.

మత మౌఢ్యాలను మట్టిలో కలుపుదాం.. అన్నదమ్ముల్లా.. భరతావని బిడ్డల్లా. భిన్నత్వంలో ఏకత్వాన్ని ఎలుగెత్తి చాటుదాం అంటూ ఉత్తమమైన ఆలోచనలకు అక్షరాకృతినిస్తూ తొలి ప్రయత్నంలో తమ కవితా పటిమను.. సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించుకున్న కవయిత్రి సరసిజకు అభినదనలు తెలియజేద్దాం.

ప్రతులకు: పెనుగొండ సరసిజ
ఇ.నెతం. 3-1-661/1
శ్రీలత అపార్ట్‌మెంట్స్,
వావిలాపల్లి, కరీంనగర్–505 001.
వెల: 80/–
సెల్: 7386806499



**– దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## ముక్తకాలు

జీవితంలో మెట్లు
ఎక్కేవాడు చరిత్ర పురుషుడు
వ్యక్తిత్వంలో మెట్లు
దిగేవాడు చరిత్రహీనుడు.

ముందే ఊహించిదేమో వసంతం
ఈ ఉగాది ప్రభావం
ఈసారి మామిడి పూతల్లేవు
కోయిల కూతల్లేవు

కోకిలల సంగతి అటుంచినా
కాకులు సైతంలేవు
కవిత్వం వినిపించే కవి కోకిలలేలేవు
కనీసం అరచే కవి కాకాలూ లేవు

మంచి మిత్రుడుంటే చాలు
నీవు పక్కదారి పట్టనే పట్టవు
తిమిరంలోకి దీపం
తెచ్చే వాడురా నేస్తం.

లక్ష్యం కోసం బ్రతినివాడు
అక్షరమై నిలిచాడు
ఆశయం లేనివాడు
అధోగతి పాలయ్యాడు.

శ్రీ కృష్ణుడూ సుదాముడూ
స్నేహానికి ప్రతీకలు
చెక్కు చెదరని స్నేహితులే
స్నేహాన్ని చాటే పతాకలు

ఆతకొన్నవానికింత
అన్నంపెట్టు
అదివేయి గోదానాల
పుణ్యం పెట్టు

గుర్రం 'బే ఇమాన్ అంటారెందుకో?
కళ్ళెంతగిలిస్తే చెప్పిన పనిచేస్తుంది
మనిషి మాత్రం 'నమ్మక్‌హారం
తిన్న ఇంటివాసాలు లెక్కిస్తాడు

మనిషి ఇవాళ
తానే దేవుడననుకొంటున్నాడు
అందుకే దేవుడు
తన తడాఖా చూపిస్తున్నాడు

మనిషీ! దేవుణ్ణి
ఇకనైనా నమ్మురా!
ఒక సకలాతీశక్తి
ఉన్నదని తెలుసుకోరా!



**– డా॥ తిరునగరి**
సెల్: 93924 65475

## మధురవాణి

బండి బతుకు మొండి బతుకు
బతుకు బండి లాగా సాగలన్న
సాగితే బండి సాగకపోతే మొండని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

సొమ్ము ఇంత సోకు అంత
సంపాదన సొమ్మంత సోకులకు తప్పన్న
సాయబ్ సంపాదన బీబీ సోకులకేనని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

బొంకు తక్కువ రంకు ఎక్కువ
బొంకుట రంకుట రెండుతప్పని తలచన్న
సాగితే బొంకు సాగకపోతే రంకని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

సంపాదన మాని సత్రము పూని
సంపాదనలేక సత్రము చేరుట తగదన్న
సీతాపతి నీకు సీప్పేగతి అని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

ఏకుగా వచ్చి మేకుగా మారి
ఏకు మెకుగా ఉండటం తప్పన్న
సూదిలా వచ్చి దబ్బనంలా తయారగుట
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

గురువే దైవం గురువే ధైర్యం
గురువును దైవంగా పూజించుట గొప్పన్న
గురువును మించిన శిష్యుడు ఉండుట
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

ఆరాటం ఎక్కువ ఆదాయం తక్కువ
చేసినపనికి ఆదాయం ఉండుట మేలన్న
క్షణం తీరికలేదు రూపాయి ఆదాయంలేదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

సహాయం కన్నా సమయస్ఫూర్తి మిన్న
సమయస్ఫూర్తితో దేనినైనా సాధించ వచ్చన్న
అందితే జుట్టు అందకపోతే కాళ్ళని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న

అంగడి కన్నా అల్లుడు మిన్న
అంగట్లో ఎన్నిఉన్న అల్లుడితో సరిపోవన్న
అంగట్లో అన్నిఉన్నె అల్లునినొట్లొ శనివుందని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న



**–మేకల లింగమూర్తి,**
9573284788

## చీపురు కట్ట

చెప్పుబుద్ధిపుట్టె చీపురు కట్ట! నీ
పైన ఆటవెలది పద్యకవిత
కావ్యవస్తు వగుట గౌరవప్రదము, నీ
అర్హతను గురించి అడుగు నెవడు?

నీవు లేని ఇల్లు నిక్కమ్ముగా నొక్క
టైన భూమిపైన కానరాదు
నిన్ను జూడనట్టి, నిన్నెరుంగనియట్టి
వారుగూడ కానరారు జగతి!

పూట పూట నిన్ను పువ్వుబోడులు చేత
బట్టకున్న గడచు నెట్టు దినము?
పల్లవములబోలు పడతుల మృధుహస్త
ముల రహించగలుగు కలిమినీది!

ఆడువారితోడి అతిమాత్రమౌ నీదు
మైత్రిలోక విదిత, మది యటుండ
అవసరమును బట్టి ఆయుధమ్ముగ గూడ
మారగలవు నీవు వారి చేత!

వాడకున్న నొక్కనాడు నిన్నెందైన
అచొటు మలిననిలయ మౌనుగాదె!
ప్రథమ గణ్య వగుదు పరిశుభ్రతకు వాడు
నట్టి పరికరమ్ములందు నీవు!

నిన్ను చేత బట్టుకొన్న, చీపురుకట్ట!
నేల శుభ్రపడుట నిశ్చయమ్ము
ఏ మహాత్ముడెపుడు సృష్టించెనో నిన్ను
మానవీయుడతడు మానవులకు!

స్వచ్ఛతను గురించి సర్కారు శ్రద్ధ వ
హించియుండె నిప్పుడెంతగానొ
సాధ్యపడును లెమ్ము 'స్వచ్ఛ భారత్' నీస
హాయ మందుచున్న నేనవతరము!

చెప్పియుండి రొకరు చీపురుకట్టపై
గతమునందు కంద శతకమొకటి
జ్ఞాపకమ్ములేదు కవిగారి పేరు నా
కైన నేమి, వారి కంజలింతు!



**–హెచ్.ఆర్. చంద్రం**
సెల్: 9493248053

## 'బతుకు' అంటే!

బతుక్కోసం, మెతుక్కోసం
క్షణం, క్షణం యుద్ధమే
చదువు, ఉద్యోగం, పెళ్లి
పిల్లలు, బ్యాంక్ అకౌంట్లు, లాకర్లు
షేర్లు, నెట్‌వర్కులు
అన్నింటికీ యుద్ధమే
ఓ మంచి పుస్తకం చదివే తీరిక లేదు
ఓ ప్రవచనం వినే ఓపిక లేదు
ఉన్నదాంట్లో కొంతయినా
త్యాగం చేసేందుకు మనసొప్పదు
దైవ దర్శనానికి సమయం లేదు
ఎదుటి ప్రతిభనభినందించేందుకు
'ఇగో' ఒప్పుకోదు
కుక్కపిల్లకు చిన్నరొట్టెముక్క
వేద్దామన్న ధ్యాసలేదు

ఆత్మీయుల్ని పలకరించడానికి
అహం అంగీకరించదు
శ్రమజీవికంటి చెమ్మతుడిచే
బాధ్యత గుర్తుకు రాదు
అవినీతినీ, స్వార్థాన్నీ
నిలదీసే ధైర్యం లేదు.
పిచ్చుక ముందిన్ని గింజలో
చల్లుదామన్న ఆలోచన రాదు
బతుక్కి భాష్యం యిదేనని
రేపు పుస్తకాలచ్చవుతాయేమో!



**–చిమ్మపూడి శ్రీరామమూర్తి**
సెల్: 9704177270

## వెతుకులాట

తప్పిపోయిన జీవితాన్ని వెతికిచ్చే
చిటికెనవేలు చిరకాలంగా దాచుకున్న
సత్యాలను బోధపరుస్తుందని
ఆశేదో లాగుతుంటుంది

వెతలు తీర్చమని ప్రార్థనలు చేస్తాంకానీ
అదనంగా వచ్చిన వెలితో
అగాధమో పూడ్చుకోవాల్సింది
మనమే కదా...మౌనంకాదుకదా

మౌనం సమాధానమని భావించే ప్రపంచంలో
వార్తలా వ్యాపించే అపోహల
హాలాహాలానికి విరుగుడు
మంత్రదండమైన ధ్యానం సంజీవినని
ఏదేవుడూ చెప్పడు

నిన్ను నువ్వు వెతకటమే
జీవితమని తెలుసుకున్నరోజు
ఏ చిటికెనవేలూ అవసరముండదు
తొక్కిసలాటలే లలాటలిఖితమని
లెక్కించే క్షణాలు కాదిప్పుడు
లాలించే ఉదయాలు
ఆశనిచ్చే సాయంత్రాలను వెతకాలి
అది నీకు నువ్వుగా చేయాలిసుమా



**–సి.యస్.రాంబాబు**
9490401005

